ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 24 జూలై 2024

ఆర్టీసీ రీజియన్‌కు 29 కొత్త బస్సులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూలై 23 : ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌లో డొక్కు బస్సులకు కాలం చెల్లనుంది. వాటి స్థానంలో కొత్తబస్సులు రానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ జిల్లా అధికారులు కాలం చెల్లిన బస్సుల స్థానంలో 110 బస్సులు పంపాలని ప్రతిపాదనలు పంపారు. అయితే, వీటిని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోపే జిల్లాకు 29 కొత్త సూపర్ లగ్జరీ బస్సులను పంపింది. మరోవైపు కొంత మైనర్ రిపేర్లు ఉన్న సూపర్ లగ్జరీ బస్సులను పల్లె వెలుగు బస్సుల కింద తిప్పేందుకు ఆర్టీసీ ఆర్ఎం ఆదేశాలు జారీ చేశారు. ఆ బస్సుల స్థానాల్లో దూరప్రాంతాలకు కొత్త బస్సులు నడుపుతున్నారు.

ఏపీకి ప్రాధాన్యం హర్షణీయం



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయం. కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టిన కూటమి ప్రభుత్వానికి అభినందనలు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు రాష్ట్రానికి భారీస్థాయిలో నిధులు రాబట్టేలా చేశాయి. అలాగే భవిష్యత్తులోనూ రాజధాని నిర్మాణానికి సహాయం అందుతుందని కేంద్ర మంత్రి ప్రకటించడం హర్షణీయం. సమర్థవంతమైన నాయకత్వం ఎలా ఉంటుందో సీఎం చంద్రబాబు చేసి చూపారు.

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ

ఏపీకి వరాల జల్లు



రాజధాని అమరావతికి భారీ ఆర్థిక సహాయం ప్రకటించటం సంతోషకరం. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలుకు చర్యలు తీసుకోవటం శుభపరిణామం. ఏపీలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించటం గొప్ప విషయం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం ప్రాంతాలకు నిధులు కేటాయించటం ద్వారా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. సాధ్యమైనంత త్వరగా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనే నిర్ణయం హర్షణీయం. విశాఖ-చెన్నై, బెంగళూరు-ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రోత్సాహం ఇచ్చారు.

- పొంగూరు నారాయణ, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి

చంద్రబాబు కృషి ఫలితమే



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి ఫలితమే. రాష్ట్ర రాజధాని అమరావతితోపాటు విద్య, నైపుణ్యాభివృద్ధికి, వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక నిధులు కేటాయించడం, స్వయం ఉపాధి పొందుతున్న చేతివృత్తి మహిళలకు రుణసాయం పెంచడం అభినందనీయం.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

అమరావతికి నిధులివ్వడం హర్షణీయం



ఏపీ గుండెకాయ అమరావతికి నిధులు మంజూరు చేస్తూ కేంద్రం తన బడ్జెట్‌లో ప్రకటించడం హర్షణీయం. ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న పోలవరాన్ని పూర్తి చేసే బాధ్యత ను కూడా కేంద్రం తీసుకుంది. ఇదంతా చంద్రబాబు చొరవ వల్లే జరిగింది. వేతన జీవులకు వెసులుబాటు కల్పించడం సంతోషం.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే

బంగారం ధరలు తగ్గుతాయి



కేంద్ర బడ్జెట్ ద్వారా బంగారు, వెండి ధరలు తగ్గడానికి అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.7వేల వరకు ఉంది. బంగారంపై విధించే సుంకం తగ్గించడం వల్ల బంగారం ధరలు దిగివచ్చాయి. ఉన్నత విద్యా విద్యా రుణాల కేటాయింపు మధ్యతరగతి వారికి ప్రయోజనం కలుగుతుంది.

- కొండూరు దుర్గాదేవి, గృహిణి



పారిశ్రామిక పరుగు..

యువతకు భరోసా

- విశాఖ-చెన్నై కారిడార్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు
- కొప్పర్తి, ఓర్వకల్లు వాడలతో జిల్లాకు అనుబంధం
- మధ్య తరగతి ప్రజలకు ఐటీ ఊరట. అన్ని వర్గాల్లో హర్షం

నెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌పై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈదఫా రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్ల నిధులు కేటాయించడమే కాకుండా వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక నోడ్‌లకు నిధులు కేటాయించడం, పోలవరం పూర్తి చేసేందుకు నిధులన్నీ సమకూరుస్తామని కేంద్ర విత్త మంత్రి నిర్మలమ్మ ప్రకటించడం శుభపరిణామమని విశ్లేషకులు చెప్పుకుంటున్నారు. అదే సమయంలో కేంద్ర బడ్జెట్ జిల్లాలో పారిశ్రామిక రంగానికి ఊతం ఇస్తుందని అభిప్రాయపడుతున్నారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం అందిస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ కారిడార్‌లో కీలకమైనది కృష్ణపట్నం పారిశ్రామిక నోడ్. ఇప్పటికే ఆ నోడ్‌లో మౌలిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఈదఫా బడ్జెట్‌లో కూడా నిధులు అందిస్తామని ప్రకటించడంతో కృష్ణపట్నం నోడ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు మెరుగుపడనున్నాయి. అలానే కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక్ నోడ్, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు నోడ్‌లకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. అక్కడ పరిశ్రమలు ఏర్పడితే వాటికి ఎగుమతి, దిగుమతులన్నీ జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు నుంచే జరగనున్నాయి. ఇక కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తే, ఆ ఉద్యోగుల మొదటి నెల జీతాన్ని కేంద్ర ప్రభుత్వం బోనస్‌గా అందిస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇది కొత్త కంపెనీల ఏర్పాటుకు ఎంతో తోడ్పాటును అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇటు కృష్ణపట్నం అటు రామాయపట్నం పోర్టు నడుమ వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్న నేపథ్యంలో తాజాగా కేంద్ర రాయితీలు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు కల్పిస్తున్నాయి.

మధ్యతరగతికి ఊరట

మధ్య తరగతి ప్రజలకు మేలు జరిగేలా ఆదాయపు పన్ను శ్లాబులలో మార్పులు చేశారు. ఇప్పటి వరకూ 3 లక్షల్లోపు ఆదాయం ఉంటే ఐటీ చెల్లించాల్సిన అవసరం లేదు. 3 నుంచి 6 లక్షల మధ్య ఐదు శాతం పన్ను చెల్లిస్తుండగా, ఆ గరిష్ఠ మొత్తాన్ని 7 లక్షలకు పెంచారు. అలానే ఇప్పటివరకూ 6 నుంచి 9 లక్షల మధ్య ఆదాయం ఉన్న వారు 10 శాతం ఐటీ చెల్లిస్తుండగా ఇకపై 7 నుంచి 10 లక్షలలోపు ఆదాయం ఉన్న వారు మాత్రమే 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో దాదాపు లక్ష మందికిపైగా ఆదాయపు పన్ను చెల్లించే వారు ఉండగా అందులో సగం మందికి కొత్త శ్లాబు విధానం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని అంచనా. అదే సమయంలో ఆదాయపు పన్ను చట్టాన్ని సమీక్షిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలోని వ్యాపారులకు ఇది మేలు చేస్తుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఎన్‌సీఈఆర్‌టీ, తెలుగు ప్రాచీన అధ్యయన కేంద్రాలకు ఈ దఫా నిధులు దక్కే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులలో తమ సంస్థలకు ఏ మేరకు కేటాయించారన్న విషయం తెలియడానికి కొంత సమయం పడుతుందని వారు చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ఊతం

భవిష్యత్ భారతాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో తాజా గా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయానికి భారీగా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రకటించారు. ఏడాదిలో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలన్నది లక్ష్యం. జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. వారిలో ఇప్పటికే అనేక మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రోత్సాహకాలు ఇస్తున్న నేపథ్యంలో మరింత మంది అటువైపు అడుగు వేసే అవకాశాలు ఉన్నాయి.

చిరువ్యాపారులపై 'ముద్ర'

ఇక చిరు వ్యాపారులకు ముద్ర రుణాలను రూ.10 లక్షల వరకు అందిస్తుండగా ఆ మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచారు. వ్యాపారాల విస్తరణకు, కొత్త వ్యాపారాల ప్రారంభానికి ఈ పెంపు ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా దేశంలోని టాప్ 500 కంపెనీల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌నకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో వేల మందికి ఇది సువర్ణావకాశంగా మారనుంది.

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : కేంద్ర బడ్జెట్‌లో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌తోపాటు విజయవాడ-గూడూరు మధ్య మూడవ రైల్వేలైన్‌కు కేటాయింపులు చేశారు. మెట్ట ప్రాంతవాసులు ఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైనుకు రూ.450 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ.2289 కోట్లతో 309 కి.మీ పొడవున రైల్వేలైను నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణతోపాటు ప్రాజెక్ట్ వ్యయంలో 50 శాతం భరించాల్సి ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం నిధుల కేటాయింపుతో పాటు భూసేకరణ సక్రమంగా పూర్తి చేయలేదు. దీంతో పనులు ఆలస్యం అవుతూ వస్తున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.450 కోట్లు కేటాయించడంతో పాటు ఎన్‌డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో పనులు వేగం పుంజుకోనున్నాయి. అదేవిధంగా గూడురు - విజయవాడ మూడవ రైల్వేలైను పనులు దాదాపు 80శాతం పూర్తయ్యాయి. మిగిలిన 20 శాతం పనులు చివరి దశలో ఉన్నాయి. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు మంజూరు చేశారు.

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌కు రూ.450కోట్లు
- గూడూరు-విజయవాడ 3వలైన్‌కు రూ.500 కోట్లు

ప్రామాణిక తగ్గింపు హర్షణీయం



ఉద్యోగుల ఆదాయపు పన్ను నూతన విధానంలో ప్రామాణిక తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్) రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు పెంపు హర్షనీయం. కింద స్థాయి ఉద్యోగులకు సుమారు రూ.5వేల వరకు పన్ను రాయితీ వస్తుంది. పైస్థాయి అధికారికి గరిష్ఠంగా రూ.17,500 పన్ను రాయితీ లభిస్తుంది. మొత్తం మీద ఉద్యోగులందరికీ వారి స్థాయిని బట్టి లబ్ధి చేకూరుతుంది. అలాగే ఉద్యోగులు ప్రతి కొనుగోలుపై కడుతున్న జీఎస్‌టీని దృష్టిలో ఉంచుకొని ప్రామాణపు తగ్గింపు పరిమితిని మరింత పెంచితే అధిక మేలు జరిగేది. మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు.

- పీవీఎస్‌టీ రాంప్రసాద్, స్టాటిస్టికల్ అధికారి, నెల్లూరు

స్లాబ్‌ల వారీగా తగ్గింపు బాగుంది



ఉద్యోగుల ఆదాయపు పన్ను నూతన విధానంలో స్లాబ్‌ల వారీగా పన్ను శాతం తగ్గింపు బాగుంది. రూ.3 లక్షల వరకు పన్నులేదు. ఆ తర్వాత రూ.7 లక్షల వరకు 5శాతం, 7 నుంచి 10 లక్షల వరకు 10శాతం, 10లక్షల నుంచి 12 లక్షల వరకు 15 శాతం పన్ను విధింపు సంతృప్తికరం. క్యాన్సర్ వ్యాధికి మందులపై సుంకం ఎత్తివేత కూడా ఉపయోగకరం. లెదర్ ఉత్పత్తులపై పన్ను శాతం తగ్గించడం హర్షదాయకం. కస్టమ్స్ డ్యూటీ 15 శాతం తగ్గింపు వల్ల సెల్‌ఫోన్ ధరలు తగ్గుతాయి.

- బి. సుధాకర్‌రెడ్డి, ఏపీజీఈఏ, జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు గౌరవం



ఆరేళ్ల క్రితం తర్వాత బడ్జెట్‌పరంగా ఆంధ్రప్రదేశ్‌కు గౌరవం లభించింది. ఏపీలో కూటమి ప్రభుత్వం అడిగినంత ఇవ్వకపోయినా రాష్ట్ర రాజధానికి రూ.15వేల కోట్లు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరిగేందుకు సానకూలత వ్యక్తం చేయటం హర్షణీయం. విశాఖ-చెన్నై కోస్టల్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం, స్కిల్ డెవలప్‌మెంటుకు చేయూత తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు సహకరించడం గౌరవప్రదం.

- నాటకం తిరుమలయ్య, ఉపాధ్యాయుడు

పన్ను విధానంలో తగ్గించి ఉంటే బాగుండేది



పెన్షనర్లు అధిక శాతం మంది పాత పన్ను విధానాన్ని ఎంచుకొని ఉన్నారు. పాత పన్ను విధానంలో శ్లాబుల ప్రకారం రూ.3 లక్షల వరకు పన్ను లేదు. రూ.3 లక్షల నుంచి 5లక్షల వరకు 5 శాతం, రూ. 5లక్షల నుంచి 7లక్షల వరకు 10శాతం, రూ.7.5లక్షల నుంచి 10లక్షల వరకు 15 శాతం, రూ.10 లక్షల నుంచి 12.5 లక్షల వరకు 20 శాతం పన్ను ఉంది. అన్ని శ్లాబులలో 2.5 శాతం పన్నును అదనంగా తగ్గించి ఉంటే బాగుండేది. పాత పన్ను విధానంలో ముఖ్యంగా పెన్షనర్లకు మినహాయింపులు ఇచ్చి వుంటే బాగుండేది.

- పాముల నిర్మల, పెన్షనర్

దేశప్రగతికి బాట వేసేలా



రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతికి, పోలవరానికి చేయూతనివ్వడంతోపాటు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం. అయితే, వ్యక్తిగత పన్నులకు పెద్దగా మినహాయింపులు లభించలేదు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు పెద్ద పీట వేసే విధంగా కొత్త కంపెనీల్లో ఉద్యోగాలకు మొదటి నెల జీతాన్ని తిరిగి బోనస్‌గా చెల్లిస్తామని ప్రకటించడం గొప్ప విషయం.

- చిన్ని శ్రావణ్‌కుమార్, చార్టెడ్ అకౌంటెంట్

వేతన జీవులకు తీవ్ర నిరాశ



బడ్జెట్‌లో పాత ఆదాయపన్ను స్లాబులు మార్చకపోవటం వల్ల వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించింది. పెరిగిన ధరలు, ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని పన్ను విధానంలో మార్పులు చేసి ఉంటే మధ్యతరగతి వర్గాలకు, సామాన్య వేతనజీవులకు మేలు చూకూరేది. సేవింగ్స్ పరిమితిని కనీసం రూ.2.5 లక్షలకు పెంచి ఉంటే పొదుపు చేసుకోవడానికి ప్రోత్సాహం ఉండేది. రూ.8లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చి ఉంటే బాగుండేది. ఉద్యోగులంతా కోరుకునే విధంగా ఆర్థిక భద్రత కలిగించడానికి సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించి ఉంటే బాగుండేది.

- అల్లంపాటి సురేంద్రరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వీఎస్‌యూలో డిగ్రీ కోర్సులు ప్రారంభం

వెంకటాచలం, జూలై 23: కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో 2024- 25 నుంచి 4యుజీ డిగ్రీ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ హానర్స్ ఫిజిక్స్‌లో 50సీట్లు, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 60సీట్లు, బీబీఏ హానర్స్ లాజిస్టిక్స్‌లో 60సీట్లు, బీఎస్సీ హానర్స్ స్టాటిస్టిక్స్‌లో 50సీట్లు ఉంటాయన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వర్సిటీలో యుజీ డిగ్రీ అడ్మిషన్ల కోసం ఓఏఎండీసీ పోర్టల్, యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వర్సిటీ అడ్మిషన్స్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ హనుమారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్‌తో పాటు వర్సిటీ అధికారులు కూడా కలిసి పర్యవేక్షిస్తారన్నారు. ఇతర వివరాల కోసం వర్సిటీలోని డీఓఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

34 మంది తహసీల్దార్ల రిలీవ్

నెల్లూరు (హరనాథపురం) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జోన్-3 పరిధిలోని జిల్లాల నుంచి నెల్లూరు జిల్లాకు వచ్చిన 34 మంది తహసీల్దార్లను మంగళవారం రిలీవ్ చేశారు. కాగా అక్కడ రిలీవ్ అయిన 42 మందికి పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది.

'విశ్వకర్మ'కు లబ్ధిదారులను ఎంపిక చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద లబ్ధిదారులను మూడు దశల్లో పరిశీలన చేసి ఎంపిక చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విశ్వకర్మ పథకం అమలు కమిటీతో ఆయన సమీక్షించారు. ఇప్పటివరకు ఈ పథకం కోసం 68,546 దరఖాస్తులు వచ్చాయని, వీటిని సచివాలయ సిబ్బంది ద్వారా పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఎల్‌డీఎం శ్రీకాంత్, శర్మద పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక బృందాలు

ఇసుక పంపిణీ, అక్రమ రవాణా నిరోధించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. స్టాక్‌యార్డులు, స్టాక్ పాయింట్ల నుంచి మాత్రమే కేవలం రవాణా ఖర్చులు మాత్రమే భరిస్తూ ఉచితంగా ఇసుకను ప్రజలకు అందించాలన్నారు. ప్రతి యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మైనింగ్ శాఖ డీడీ శ్రీనావాసకుమార్, జేసీ సేధుమాధవన్, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, ఆర్‌డీవో మాలోల, మధులత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ విజ్ఞప్తుల స్వీకరణ

నెల్లూరు (హరనాథపురం) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రతిరోజూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తారని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేగాక ప్రజలే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా https. meekosam. ap.gov.inలో ఆధార్ నెంబరును ఉపయోగించి తమ సమస్య లను నమోదు చేయవచ్చని అన్నారు. అలాగే, కలెక్టరేట్, మండల, డివిజన్ స్థాయిల్లో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● మూడు సవర్ల బంగారు ఆభరణాలు.. ● 1.5 కేజీల వెండి వస్తువుల అపహరణ


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు, సీఐ శ్రీనివాసరావు

కావలి రూరల్, జూలై 23: పట్టణంలోని ముసునూరు బాలాజీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ విషయాన్ని మంగళవారం గుర్తించారు. రూరల్ పోలీసుల కథనం మేరకు, బాలాజీనగర్‌కు చెందిన పాకల రమణయ్య ఫారెస్ట్ గార్డుగా పనిచేస్తున్నారు. ఆయన భార్య ప్రమీల ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బెంగళూరులో ఉన్న కుమార్తె వద్దకు నాలుగు రోజులక్రితం ప్రమీల వెళ్లారు. రమణయ్య సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి జలదంకి మండలం జమ్మలపాలెంలో జరుగుతున్న అమ్మవారి పొంగళ్లకు వెళ్లారు. బెంగళూరు నుంచి మంగళవారం ఉదయం ఆరుగంటలకు ముసునూరులోని ఇంటికి ప్రమీల చేరుకోగా, పొంగళ్లకు వెళ్లిన రమణయ్య ఉదయం ఏడు గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంటి తాళాలు తీసి బెడ్‌రూంలోకి వెళ్లగా కిటికీ గ్రిల్ ఊడతీసి లోపలికి ప్రవేశించిన గుర్తు తెలియని దుండగులు బీరువా పగలగొట్టి ఉన్నారు. బీరువాను పరిశీలించగా అందులోని మూడు సవర్ల బంగారు నగలు, 1.5 కేజీల వెండి వస్తువులు దొంగిలించుకు పోయినట్లు గుర్తించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావు పరిశీలించారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

సీతారామపురం, జూలై 23: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల పాఠశాలలు, మండల విద్యాశాఖ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సిహెచ్ ఉషారాణి తనిఖీ చేశారు. మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల బోధన అభ్యసన విధానాలను, పాఠశాలలోని వసతులు, రికార్డులను పరిశీలించి సూచనలిచ్చారు. విద్యాశాఖ కార్యాలయంలో స్టూడెంట్ కిట్స్, మధ్యాహ్నం భోజన పథకం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గర్ల్‌చైల్డ్ అభివృద్ధి అధికారి మమత, మండల విద్యాధికారి షేక్ మస్తాన్‌వలి, సీఆర్పీలు కులారి వెంకటేశ్వర్లు, విజయభాస్కర్, జయరావ్ పాల్గొన్నారు.

కత్తితో ఒకరిపై దాడి

సంగం, జూలై 23: జండాదిబ్బలో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన వివాదం దాడికి దారితీసిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నాయబ్, మౌలాలిలు స్నేహితులు. ఈ క్రమంలో ఇద్దరు మరో యువకుడితో కలసి మద్యం తాగేందుకు సమీప పొలాల వద్దకు వెళ్లారు. అక్కడ మద్యం తాగుతూ నాయబ్, మౌలాలిల మధ్య మాటామాట పెరిగి వివాదం ఏర్పడింది. చివరకు నాయబ్ మౌలాలిపై కత్తితో దాడి చేశాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి క్షతగాత్రున్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

రాపూరులో అక్రమ లేఅవుట్లపై

ప్రజా సంఘాల కన్నెర్ర

● చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతి


అసైన్డ్ భూముల్లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాపూరు (డక్కిలి), జూలై 23 : రాపూరు మండలం మద్దెలమడుగు కేంద్రంగా సాగుతున్న అసైన్డ్ భూముల్లో అక్రమ లే అవుట్ల వ్యవహారంపై మంగళవారం ప్రజాసంఘాలు కన్నెర్రజేశాయి. మద్దెలమడుగు సచివాలయానికి సమీపంలో సర్వే నెం.1056-2లో అసైన్డ్ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ లే అవుట్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడున్న 2.65 ఎకరాల అసైన్డ్ భూముల్లో ఇదివరకే లే అవుట్ వేసి ప్లాట్లు విక్రయించగా మిగిలిన 80 సెంట్లనూ విక్రయానికి సిద్ధం చేశారు. విషయం తెలుసుకొన్న రాపూరు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఇన్‌చార్జి చింతగుంట అంకయ్య మాదిగ ఆధ్వర్యంలో సదరు భూముల్లోకి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందచేశారు. అసైన్డ్ భూముల్లో అక్రమ లే అవుట్ల వ్యవహారంపై విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అలాగే ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గద్దల మునెయ్య కూడా తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోకపోతే గ్రీవెన్స్‌డే రోజున కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు.

● **చర్యలు తప్పవు : ఆర్డీవో**

అసైన్డ్ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ లే అవుట్లను మంగళవారం నెల్లూరు ఆర్డీవో మలోల పరిశీలించారు. అసైన్డ్ భూముల్లో అక్రమంగా లే అవుట్లు వేస్తుంటే ఏం చేస్తున్నారంటూ రెవెన్యూ సిబ్బందిని మందలించినట్లు తెలిసింది. సంబంధిత వ్యక్తులపై వెంటనే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని తహసీల్దారు వెంకటస్వామికి ఆర్డీవో సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం

కలువాయి, జూలై 23 : వెంకటరెడ్డిపల్లి సమీపంలోని పెన్నానదిపై నిర్మించిన జాతీయ రహదారి 565 వంతెనపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కలువాయికి చెందిన కట్టిబోయిన లక్ష్మీ సూర్య (16) అనే ఇంటర్ విద్యార్థి దుర్మణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. కలువాయి సూరేపల్లి నాగేంద్ర, బొల్లిశెట్టి మల్లింకొండయ్య, కట్టిబోయిన లక్ష్మీ సూర్య ముగ్గురు స్నేహితులు. వీరు ముగ్గురు సోమవారం రాత్రి 8.30గంటల సమయంలో మోటారుసైకిల్‌పై జాతీయ రహదారిలో వెళుతున్నారు. రోడ్డుపై చనిపోయి పడి ఉన్న గెదెను గుర్తించక మోటారు సైకిల్ ఢీకొని ముగ్గురు కింద పడ్డారు. తీవ్రగాయలైన లక్ష్మీసూర్య, సూరేపల్లి నాగేంద్రను చికిత్స కోసం నెల్లూరు తరలించారు. నెల్లూరులో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి లక్ష్మీ సూర్య మృతి చెందాడు. సూర్య నెల్లూరులో ఇంటర్ మెదటి సంవత్సరం చదువుతూ హోంసిక్‌పేరుతో హాలిడేస్‌కు కలువాయికి వచ్చారు. ఏఎస్‌ఐ రమణయ్య ఈ మేరకు కేసు నమోదు చేశారు.

నెల్లూరు మ్యూజియం అభివృద్ధికి కృషి

● ఆర్కియాలజీ కమిషనర్ వాణీమోహన్


తల్పగిరి రంగనాథస్వామి సేవలో రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్

నెల్లూరు(సాంస్కృతి కం), జూలై 23 : నెల్లూరు నగరంలోని మ్యూజియం అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పురావస్తు శాఖ కమిష నర్ జి.వాణీమోహన్ తెలి పారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె నగరంలోని మ్యూజియంను సందర్శించి అందులోని పురావస్తు సంపదను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పురావస్తు శాలను ఆధునీకరించి భావితరాలకు వారసత్వ సంపదగా అందించాలని ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. విజయవాడ, అనంతపురం పురావస్తుశాలను ఆధునీకరించామని తెలిపారు. నెల్లూరు పురావస్తుశాల ఆధునీకరణకు నివేదిక పంపా లని ఏడీ గంగాధర్‌కు సూచించారు. అనంతరం నెల్లూ రు తల్పగిరి రంగనాథస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట పురావస్తు శాఖ ఏడీ గంగాధర్, జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు, ఈవో ఏవీశ్రీనివాసులు రెడ్డి, వి.గిరి, తదితరులు ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	133
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	264
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6633
వెండి కిలో ధర	రూ. 87,800
వెండి ఒక గ్రాము	రూ. 89.80

ఇక సొంతింటి కల సాకారం !?

● యూనిట్ కాస్ట్ పెంచే యోచనలో ఎన్డీఏ ప్రభుత్వం
● రూ. 1.5 లక్షలకు అదనంగా మరో లక్ష
● ఇప్పటికే అమల్లోకి ఉచిత ఇసుక
● పథకం పేరు ఎన్టీఆర్ హౌసింగ్‌గా మార్పు

సంగం, జూలై 23 : ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారం కానున్నది. గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే సరి పెట్టి వైఎస్సార్ గృహనిర్మాణ పథకం పేరుతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కాలనీ ఆ ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం పైసా ఇవ్వకనే సొమ్ములు కేంద్రానివి.. సోకులు రాష్ట్రానివి అన్నట్లుగా వ్యవహరించింది. కానీ నెల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 2014-19 మధ్యకాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మాదిరిగా లక్ష అదనంగా ఇచ్చే దిశగా అడుగులు వేయడం శుభపరిణామం.

● **నిర్మాణానికి సరిపోయేలా సాయం**

కూటమి ప్రభుత్వం రాష్ట్ర వాటాను ఇవ్వాలనే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తున్నది. 2014-19 మధ్య కాలంలో ఇచ్చినట్లు రూ. లక్షవాటా ఇచ్చినా, ఇప్పుడు ఇసుక ఉచితంగా అందుబాటులో ఉండడంతో లబ్ధిదారులకు మేలు చేకూరనున్నది. కేంద్ర వాటా రూ. 1.5 లక్షలు, రాష్ట్ర వాటా రూ. 1 లక్ష కలిపి లబ్ధిదారుడికి మొత్తంగా రూ. 2.50 లక్షలు అందుతుంది. మరో రూ. లక్ష చేతి నుంచి వేసుకుంటే లబ్ధిదారుడికి సొంతింట కల నెరవేరుతుంది.

● **జిల్లాలో ఇళ్ల పరిస్థితి**

వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాకు 73,561 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 25 శాతం పూర్తయ్యాయి. అది కూడ ఫేజ్ 1లో ప్రారంభించిన మున్సిపాలిటీల్లోనే, ఫేజ్ 2 కింద రూరల్‌లో చేపట్టిన కాలనీ ఇళ్లు ఐదు శాతం కూడా పూర్తి కాలేదు. ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ. 1.5 లక్షలతోనే సరిపెట్టడంతో నిధులు సరిపోక లబ్ధిదారులెవరూ నిర్మాణానికి ముందుకు రాలేదు. కేటగిరి 3 కింద కాంట్రాక్టర్లకు అప్పగించారు. వారు బేస్‌మెంట్‌లు వేసి రూ. 70 వేల బిల్లులు తీసుకుని తాత్కాలికంగా నిర్మాణాలు నిలిపివేశారు. ఆ తరువాత చేపడితే గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్లు పనులు చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో అర్ధంతరంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి.


నిధుల కొరతతో సంగంలో అర్ధంతరంగా ఆపేసిన గృహాలు

● **పథకం పేరు మార్పు**

వైస్సార్ గృహ నిర్మాణ పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్చింది. 2014-19 మధ్య కాలంలో ఉన్న పేరును మళ్లీ పెడుతూ తాజాగా జీవో విడుదల చేసింది. 2014-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్, ఎన్టీఆర్ స్పెషల్ హౌసింగ్ పథకాలను వైసీపీ ప్రభుత్వం వైస్సార్ రూరల్ హౌసింగ్, వైస్సార్ స్పెషల్ హౌసింగ్ అనే పేర్లు మార్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ పాత పేర్లను పెట్టింది.

● **పాత ఇళ్లపై లేని స్పష్టత**

అర్హులకు కూటమి ప్రభుత్వం కొత్త ఇళ్లను మంజూరు చేయనుంది. కొత్తగా మంజూరు చేసే ఇళ్లకు యూనిట్ కాస్ట్ పెంచే అవకాశం ఉంది. ఇప్పటికే మంజూరై వివిధ దశల్లో ఉన్న ఇళ్ల గురించి ఇంకా స్పష్టత రాలేదు. పెండింగ్ బిల్లుల గురించి కూడా క్లారిటీ లేదు.

26న సాఫ్ట్‌బాల్

జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), జూలై 23 : జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కోటారెడ్డి, సీహెచ్.కామేశ్వరిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్, జనన సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో శ్రీకాకుళంలో జరిగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9703654315, 8074299640ను సంప్రదించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులను నివారించండి

● మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ


సీజనల్ వ్యాధులపై మాట్లాడుతున్న హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), జూలై 23 : జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులను నివారించేలా కలిసి పనిచేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మలేరియా విభాగంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు, సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షాలు విరివిగా కురుస్తున్న నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయని, వాటి నివారణకు పాటుపడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా దోమల నివారణకు కృషి చేయాలని సూచించారు. లార్వా దశలోనే దోమలను నివారించేందుకు అందరి సహకారం అవసరమని, దీనిలో ఎలాంటి రాజీ లేకుండా సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అదనపు అధికారి నాగార్జున, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినులకు సప్లిమెంటరీ పరీక్షలు

● గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి హాజరు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

నెల్లూరు(వైద్యం), జూలై 23 : నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో నర్సింగ్‌లో ఏఎన్ఎం కోర్సు చదువుతున్న విద్యార్థినులకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు ఎగ్జామినర్‌గా కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత వ్యవహరించారు. ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షలు ఈ నెల 26వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో వివిధ నర్సింగ్ కళాశాలలకు చెందిన మొత్తం 110 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరయ్యారని ఆమె తెలిపారు.

స్కూటీని ఢీకొన్న కారు: ఒకరికి తీవ్రగాయాలు

సంగం, జూలై 23: మండలంలోని ముంబాయి రహదారిపై ఎస్వీఆర్ పురం క్రాస్ రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న స్కూటీని వెనుక వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై వెళుతున్న కోలగట్ల గ్రామానికి చెందిన ఏడుకొండలు అనే యువకుడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన స్కూటీపై బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయాలైన ఏడుకొండలను అదే కారులో వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

● ఏపీ రాజకీయాలలో ఆయన కనుమరుగు కావడం తథ్యం
● వైసీపీ వారిలా కక్షసాధింపులకు దిగం
● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి


మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

వైఎస్ జగన్ శాడిస్టే కాదు..

తెలివి తక్కువ దద్దమ్మ కూడా!

నెల్లూరు (వైద్యం), జూలై 23 : 'వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శాడిస్టే కాదు.. తెలివి తక్కువ దద్దమ్మ కూడా.."నంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ గేటు వద్ద సోమవారం జరిగిన సంఘటన చూస్తే జగన్ తెలివి తక్కువ వాడని అర్థమవుతోందన్నారు. వైసీపీకి చెందిన ఇద్దరు కార్యకర్తలు చంపుకుంటే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆయన వైఖరి నచ్చక ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలు గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో పోలీసులను అడ్డుపెట్టుకుని జగన్ ఎన్నో అరాచకాలు చేశారని, టీడీపీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలను అనేక ఇబ్బం దులకు గురిచేసి 64 కేసులు పెట్టినా ఎక్కడా తగ్గకుండా పార్టీ వెంటే ఉన్నారని అన్నారు. అసెంబ్లీలో నారా భువనే శ్వరిని తిట్టిన ఎమ్మెల్యేలు, శాసనమండలిలో జిప్ విప్పిన సైకోలు ఇటీవల జరిగిన ఎన్నికలలో అడ్రస్ లేకుండా పో యారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తలచు కుంటే వైసీపీ నాయకులలో ఒక్కరు కూడా పార్టీలో ఉండ రని వెల్లడించారు. వైసీపీ వారిలా కక్షసాధింపు చర్యలకు దిగబోమని స్పష్టం చేశారు. కనీసం ఆరు నెలలు పోరాటం చేయలేక పలువురు వైసీపీ నేతలు తమ ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారని విమర్శలు గుప్పించారు. ఏపీ రాజకీయాలలో జగన్ త్వరలో కనుమరుగు కావడం ఖాయమని జోస్యం పలికారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, కువ్వారపు బాలాజీ, జహీర్, అంచూరు శ్రీనివాసులనాయుడు, మహేంద్రరెడ్డి, పుట్టా విజయ్, మొయిద్దీన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బొమ్మవరం చెరువు భూమి ఆక్రమణ


● ముళ్లపొదలు తొలగించి బోరు ఏర్పాటు


చెరువులో బోరు వేసి పొలం మార్చేందుకు తొలగించిన మొక్కలు

అనంత సాగరం, జూలై 23: మండలంలోని బొమ్మవరం చెరువు పరిధిలోని భూమిని కొందరు వైసీపీ నాయకుల అనుచరులు ఆక్ర మణకు ఉపక్ర మించారు. సుమారు ఐదు ఎకరాల స్థలంలో మొక్కలు, ముళ్లకంపలు తొలగించి పొలంగా మార్చేందుకు పనులు చేయించారు. అక్కడ బోరు కూడా వేయించడం విశేషం. చెరువు ఆక్రమణపై గ్రామస్థలు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు లేక చెరువులో నీరు లేక పోవడంతో ఎవరికి వారు ఇష్టానుసారంగా చెరువు ఆక్రమించి సాగు భూమిగా మార్చేస్తున్నారని, పశువులను తోలుకొనేందుకు కూడా ఇబ్బందులు ఉన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'కోస్టల్ జోన్'తో ఇబ్బందులు రానీయకండి!

● మా హక్కులకు భంగం కలగకుండా ప్లాన్ అమలు చేయండి
● ప్రజాభిప్రాయ సేకరణలో మత్స్యకారులు



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అధికారులు, మత్స్యకారులు

నెల్లూరు (హరనాథపురం); జూలై 23 : సముద్రతీర ప్రాంత మత్స్యకారుల సంప్రదాయ జీవన విధానానికి ఇబ్బందులు లేకుండా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలని పలువురు మత్స్యకారులు అధికారులను కోరారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఖరారుపై డీఆర్వో లవన్న, కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. బోగోలు, విడవలూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు తదితర మండలాల్లోని తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు, పలు సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ తమ హక్కులకు భంగం కలిగించకుండా ప్లాన్ అమలు చేయాలని మత్స్యకారులు కోరారు. సీఆర్‌జెడ్ ఖరారులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రజాభిప్రాయ సదస్సులు తీరప్రాంత గ్రామాల్లో నిర్వహిస్తే ఎక్కువ మంది మత్స్యకారులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అధికారులకు వివరించారు. తమిళనాడులోని కడలూరుకు చెందిన తమిళ జాలర్ల వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీత పనులు చేపట్టాలని, ఎస్టీలకు గుర్తింపు కార్డులు అందచేసి మత్స్యశాఖ ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. సముద్రతీరంలో ఉన్న మడ అడవులను కాపాడాలన్నారు. మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీతో ఖరీదైన బోట్లను అందచేస్తున్నట్లు చెప్పారు. కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ సమావేశంలో మత్స్యకారుల అభిప్రాయాలను వీడియో రికార్డు చేసి కేంద్రపర్యావరణ శాఖకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇంజనీర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

కావలి రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్పీడీవో శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కావలి మండలం కొత్తపల్లి, ఆర్సీపాలెం గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చిమ్మిలి శ్రీహరినాయుడు, పేముల రాజేంద్ర, ఉపసర్పంచి సోమినేని రాజేశ్వరి, ఈవోపీఆర్డీ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దళితవాడల్లో పారిశుధ్య లోపం

అల్లూరు, జూలై 23 : పట్టణ పరిధిలోని దళితవాడల్లో పారిశుధ్యం లోపించింది. దీంతో ప్రజలు రోగాల బారినపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు పారిశుధ్యంపై ఆసక్తిని కనపరచడకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు అంటున్నారు. ఈ సమస్యను గత రెండేళ్లుగా అధికారులకు తెలుపుతున్నా వారిలో చలనం లేదని నగర పంచాయతీ అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతమంటే అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని దళితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని వారు కోరుతున్నారు.


ఇళ్లమధ్య పేరుకుపోయిన చెత్త

ప్రశ్నార్థకం.. పంటల సాగు!

● ఎండిన చెరువులు, కుంటలు ● బీడు భూములుగా మాగాణి భూములు



సాగులేక బీడుగా ఉన్న భూములు

ఏఎస్‌పేట, జూలై 23: ఈ ఏడాది ఆశించిన వర్షాలు కురవక పోవడంతో మండలంలో వరి సాగు చేసే రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగితే చెరువులు, కుంటల్లో నీరు పూర్తి స్థాయిలో ఉండేది. దీనికితోడు సమీప ప్రాంతంలోని పొలాల్లోని బోర్లలో సంవృద్ధిగా నీరు ఉండేది. రైతులు అనుకున్న దానికంటే ఎక్కువగా పంటలు సాగుచేసేవారు. కానీ ఈ ఏడాది వర్షాకాలం ప్రా రంభమై సుమారు రెండు నెలలు పూర్తికావస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి..

అనుమసముద్రం, గుడిపాడు, చిరమన గ్రామాల్లో ప్రతిఏడాది ఈ సీజన్‌లో 12వేల ఎకరాల్లో ఈ పాటికి వరి సాగులో అయ్యేది. ఈ ఏడాది మాత్రం నాటు వేసే పనులు ప్రారంభం కాలేదు. చాలావరకు బీడు భూములుగా ఉన్నాయి. సోమశిల ప్రాజెక్టు ఉత్తరకాలువకు విడుదల కాకపోవడంతో వరిసాగు ప్రశ్నార్థకంగా మారనుందని ఆందోళన వ్య క్తం చేస్తున్నారు. చెరువులల్లో నీరు ఎండిపోవడంతో పశువులకు తాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నా రు. సగానికి పైగా పొలాలు సాగులేకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు.

సాగు కష్టమే..



చెరువులో నీరు లేదు. వర్షాలు పడకపోవడంతో వరి సాగు చేయడం కష్టంగా కన్పిస్తుంది. చాలామంది పొలాలు చేయడంతో పొలాలు బీడు భీములను తలపిస్తున్నాయి. కూలీలకు పనులు లేక ఉపాధి దొరకదు.

- సోమల చౌడారెడ్డి, రైతు

పసులకు నీరు లేదు..



వాగులు, వంకల్లో నీరులేక నిలువునా ఎండిపోయాయి. మెతకు వెళ్లిన పశువులకు తాగునీరు దొరకడం లేదు. తప్పనిసరి పరిస్థితిలో మధ్యాహ్నంకు తిరిగి ఇంటికి వచ్చి నీటిని తాపాల్సి వస్తుంది.

- సుబ్బారెడ్డి, రైతు

బహుళ నైపుణ్యంతో బోధన చేయాలి

● జిల్లా విద్యా శాఖ అధికారి పీవీజే రామారావు



ఆత్మకూరు: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో రామారావు

ఆత్మకూరు, జూలై 23: జిల్లా విద్యాధికారి పీవీజే రామారావు స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం ఆత్మకూరు డివిజన్‌స్థాయి సపోర్టింగ్ ఆంధ్రస్ లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్ కార్యక్రమంలో భాగంగా టీచ్ టూల్ 5వ రోజు శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. ఆత్మకూరు గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరం పదో తరగతి వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై ప్రిన్సిపాల్ కామేశ్వరి, అధ్యాపకులను అభినందించారు. కార్యక్ర మంలో డిప్యూటీ డీఈవో గోపాల్, జిల్లా సమగ్ర శిక్ష విద్యా విషయక పర్యవే క్షణ అధికారి సుధీర్‌బాబు, ఎంఈవోలు జ్యోతి, చలపతి, మాస్టర్ ట్రైనీలు సురే ష్, నాగేశ్వరరావు, కేశవనారాయణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గణితంపై మక్కువ పెంచాలి



సంగం: విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈవో రామారావు

విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు పునాది అభ్యసన కార్యక్రమంను నిర్వహించారు. గణితంతో విద్యార్థులకు మానసిక ఆనందంతో పాటు సృజనాత్మకత అలవడుతుందన్నారు. భాషలో కనీస అభ్యసనస్థాయిలను సాధించేలా విద్యార్థులను తయారు చేయాలన్నారు.

సంగం: పడమటిపాళెం, పెరమన ప్రాథమిక పాఠశాలలను డీఈఓ రామారాము ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆయన వెంట ఎంఈవో 2 మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏఎస్ పేట: గుంపార్లపాడు హైస్కూల్‌ను డీఈఓ రామారావు పరిశీలించి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల ఆవర ణంలో మొక్కలు నాటారు. అనంతరం శిక్షసప్తాహ్ కార్యక్రమంలో జరు గుతున్న ఎఫ్ఎల్ఎన్ కృత్యాలను పరిశీలించారు. హెచ్ఎం పోతులూరయ్య, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, ఎంఈవో సాయిప్రసాద్ ఉన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

ఆత్మకూరు, జూలై 23: స్థానిక ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఆంధ్ర విద్యార్థుల సంఘం (ఏవీఎస్) ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఏవీఎస్ నాయకులు, విద్యార్థులు ప్రిన్సిపాల్ కిషోర్‌రెడ్డితో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌వోడీలు దేవానంద్, దేమముని, సుదర్శన్, ఏవీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మహంత్‌రెడ్డి, శ్రీరామ్, మనోజ్, బాలాజీ, త్రినాథ్ పాల్గొన్నారు.

ఓడీఎఫ్, జల్‌జీవన్ అంశాలపై ప్రత్యేక గ్రామసభ

సీతారామపురం,జూలై 23: స్థానిక గ్రామ పంచాయతీలోని బీట్-2 సచివాలయంలో మంగళవారం సర్పంచ్ భాగ్యకుమారి అధ్యక్షతన ఓడీఎఫ్, జల్‌జీవన్ అంశాలపై అధికారులు గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యకుమారి మాట్లాడారు. గ్రామంలోని ప్రతిఇంటి వద్ద వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని, చర్యలు తీసుకుంటామన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తామన్నారు.

వరికుంటపాడు: అన్నిగ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలిపారు. మంగళవారం రామాపురం సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెకొండ పెంచలమ్మ, కార్యదర్శి వెంకటకృష్ణయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

చేజర్ల: మడపల్లి, నెర్నూరు, ఆదురుపల్లి గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ముఖ్యంగా తాగునీరు, శానిటేషన్‌పై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మేత పోరంబోకు భూముల పరిశీలన

కలువాయి, జూలై 23: కేశమనేనిపల్లి రెవెన్యూ పరిధిలోని తిరుమలపాడు సమీపంలో ఉన్న 620ఎకరాల మేత పోరంబోకు భూములను మంగళవారం తహసీల్దారు సంజీవకుమారి పరిశీలించారు. తిరుమలపాడు గ్రామస్థులు ఈ భూములను రాత్రులు జేసీబీలతో చదును చేసుకుంటున్నారని సోమవారం కేశమనేనిపల్లి గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ భూముల్లో మా గ్రామానికి 3భాగాలు, తిరుమలపాడు గ్రామస్థులకు ఒక భాగం హక్కు ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దారు ఈ భూములను పరిశీలించారు. ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు ఇచ్చేంత వరకు ఎవరూ భూములను చదును చేయకూడదని తెలిపారు. ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

ఉదయగిరి రూరల్, జూలై 23: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ట్రాన్స్‌కో డీఈ జనార్దన్ విద్యుత్ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల సెక్షన్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఈ కోటేశ్వరరావు, మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

చేజర్ల, జూలై 23: నాగులవెల్లటూరు, తూర్పుపల్లి సచివాలయాలల్లో ఏర్పాట్లు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. తూర్పుపల్లిలో 12మంది, నాగులవెల్లటూరులో 22మంది అవకాశాన్ని వినియోగించుకున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

సీతారామపురం, జూలై 23: ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్‌లు మంగళవారం స్థానిక పరమటివీధి, హరిజనవాడ ప్రాంతాలలో పారిశుద్ధంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మురుగుకాలువలలో పూడిక తీసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

వింజమూరు: స్థానిక బంగ్లాసెంటర్‌లో ఎంపీడీవో రాజేష్‌బాబు, సర్పంచ్ నల్లగొండ సృజనలు సైడ్ కాలువను తీసి వర్షపు నీరు పోయేలా పూడికను తీసి వేయించారు.

అతిథి భోజనం అందాలి

ఉదయగిరి రూరల్, జూలై 23: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు దాతల సహకారంతో పుట్టిన, పెళ్లి రోజులు, ఇతర కార్యక్రమాల సమయాల్లో వారి పేర్ల మీద పండ్లు, మిఠాయిలు (అతిథి భోజనం) అందించేలా చర్యలు చేపట్టాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. స్థానిక దళితవాడ పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు సయ్యద్ కలీం విద్యార్థులకు పండ్లు అందజేశారు.

లక్ష్యాలను అధిగమించాలి

ఉదయగిరి రూరల్: వైద్యఆరోగ్య సిబ్బందికి కేటాయించాలని లక్ష్యాలను నూరుశాతం అధిగమించాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు శివకల్పన, వినీతలు తెలిపారు. మంగళవారం స్థానిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బం దితో సెక్టార్ సమావేశం నిర్వహించారు. సీహెచ్‌వో శివకుమారి, వెంకటసుబ్బయ్య ఉన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

అనంతసాగరం, జూలై 23: చిలకలమర్రి వద్ద సాగు చేసిన వేరుశెనగ పంటను మంగళవారం మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసచక్రవర్తి పరిశీలించారు. ఈసీజన్‌లో వచ్చే తెగుళ్లు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ మల్లెంకొండయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు వేస్తే చర్యలు

వింజమూరు, జూలై 23: పట్టణంలోని అక్రమ లేఅవుట్లు వేసినట్లయితే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి బంక శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 348/2ఏ లో విస్తీర్ణం 5.67 సెంట్లు హరితా లే అవుట్లు, దేవతా మాల్యాద్రి అను వారు అక్రమ లే అవుట్‌లో నెంబరు రాళ్లను తొలగించారు. అక్రమ లే అవుట్లకు నోటీసులు జారీ చేస్తామన్నారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు

ఏఎస్ పేట, జూలై 23: తెల్లపాడు పంచాయతీ రహదారిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తున్నారని మంగళవారం తహశీల్దారు రవికుమార్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ రహదారి అక్రమంగా ఆక్రమించుకోవడమే కాకుండా దానికి పట్టాను తయారు చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైద్యుడ్ని కొనసాగించాలి

ఉదయగిరి రూరల్, జూలై 23: స్థానిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు షంషుద్దీన్‌ను బదిలీ చేయకుండా వైద్యశాలలోనే కొనసాగించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వేణుగోపాల్, దస్తగిరిఅహ్మద్‌లు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే వైద్యశాలలో గైనకాలజిస్టు, జనరల్ మెడిషన్, సర్జన్, చిన్నపిల్లల వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వైద్యులందరినీ ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తే ఇక్కడి రోగుల పరిస్థితి ఏమిటని పేర్కొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 23: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు నిధులు కేటాయించడం హర్షణీయమని తెలుగుయువత మండలాధ్యక్షుడు పాముల మహేష్ మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని, ఆయన కృషి ఫలితంగానే కేంద్ర బడ్జెట్‌లో అమరావతితో పాటు పలు సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు జరిగిందన్నారు.

పోలేరమ్మకు పులివాహనసేవ

సంగం, జూలై 23: తలుపూరుపాడు పోలేరమ్మ సోమవారం అర్ధరాత్రి పులి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సం సందర్భంగా భక్తులు కర్పూరహారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా షిర్డీ సాయిబాబా గ్రామోత్సవం

స్థానిక సాయినగర్‌లో సోమవారం అర్ధరాత్రి సాయిబాబా గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు హారతలతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆర్యవైశ్యులు అలఘునాథుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి రూరల్, జూలై 23: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు మంగళవారం తహసీల్దారు నెహ్రూబాబు, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవో-2 తోట శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఫణిరాజ్ సుబ్బారెడ్డి, మున్నా, రామకృష్ణ, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

సీతారామపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి గొడ్లవేటి వెంకటేశ్వర్లు, భోగ్యం శ్రీనివాసులు, పేరాల శ్రీనివాసులు, బాల కృష్ణారెడ్డి, లక్ష్మయ్య, ఆనంద్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కొండలా విద్యుత్ బకాయిలు !

● రూ.14 లక్షల బిల్లుల పెండింగ్

● 'రాళ్లపాడు' అతిథి గృహానికి కరెంట్ కట్



నిరుపయోగంగా ఉన్న రాళ్లపాడు అతిథి గృహం

రాళ్లపాడు ప్రాజెక్టు అతిథి గృహం విద్యుత్ బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ఎంతకూ అధికారుల్లో చలనం లేకపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు సర్వీసును తొలగించారు. ఈ అతిథి గృహానికి రూ.14 లక్షల వరకు బకాయిలు ఉండటంతో ఏడాది క్రితమే కరెంట్ కనెక్షన్ కట్ చేశారు. దీంతో అతిథిగృహం వైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అతిథిగృహం నిరుపయోగంగా మారింది. గతంలో రాళ్లపాడు సందర్శనకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అతిథి గృహంలో భోజనాలు చేసి కాసేపు సేద తీరేవారు. అధికారులతో సమావేశమూ అయ్యేవారు. అలాంటిది ఇప్పుడు బోసిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంతో ప్రాముఖ్యమున్న ఈ అతిథి గృహానికి బకాయిలు చెల్లించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

- లింగసముద్రం

ప్రతి విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి : డీఎంహెచ్‌వో



కొండాపురం : ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలు అందచేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

లింగసముద్రం, జూలై 23 : ప్రతి విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య చెప్పారు.మండలంలోని పెద పవనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఆయన మంగళవారం ఉదయం సందర్శించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్నేహలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డాక్టర్ దివ్య ఫ్లోరోసిస్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం డీఎంహెచ్‌వో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థినులకు పీహెచ్‌సీ సిబ్బంది హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూరాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● **పీహెచ్‌సీ తనిఖీ**

లింగసముద్రంలోని పీహెచ్‌సీని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రియంవద మంగళవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె పీహెచ్‌సీలోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం కాన్పుల గదిని, ల్యాబరేటరీని సందర్శించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జీ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ కుమారి, స్టాఫ్ నర్సు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● **ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాల పంపిణీ**

కొండాపురం : మండలంలోని ఫ్లోరోసిస్ బాధితులకు డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య మంగళవారం పలు పరికరాలు అందచేశారు. ఫ్లోరోసిస్ బాధితులు 45 మందిని గుర్తించి వారికి అవసరమయిన వాకర్లు, లుంబర్ బెల్టు, లెట్రిన్ షీట్లు, చైర్స్, వాకింగ్ స్టిక్స్‌ను ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నసీరుద్దీన్, ఫ్లోరోసిస్ కన్సల్టెంటు డాక్టర్ దివ్య, సీహెచ్ చెంచురామయ్య, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.కాగా కొండాపురం మండలానికి 30 పడకల ఆసుపత్రిని కేటాయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున డీఎంహెచ్‌వో పెంచలయ్యకు వినతిపత్రం అందచేశారు.ఆయన వెంట మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి చల్లా చినమాలకొండయ్య తదితరులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం : బీజేపీ

కందుకూరు, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించటం పట్ల బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం బీజేపీ నేతలు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి కేంద్రప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, చల్లా వెంకటరాజా, చుండి మురళీధర్, జగన్నాథం వైకుంఠం, నవులూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కావలి : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వరాలు జల్లు కురిపించటం హర్షణీయమని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి నిర్మాణానికి రూ. 15,000 కోట్లు కేటాంచటమే కాక, పోలవరం పూర్తికి నిధులు, వైజాగ్ -చెన్నై కోస్టల్ ఇండస్ట్రీయల్ కారిడార్‌కు నిధులు ఇస్తానని చెప్పటం సంతోషదాయమన్నారు.

కొండాపురం : కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం ఇవ్వడంపై టీడీపీ మండల కన్వీనర్ ఓంకారం హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు ఫలించాయన్నారు.

నెల్లూరు : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు మంజూరు చేయటం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని తెలపడం హర్షణీయమని జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు పేర్కొన్నారు.

బైకు ఢీకొని సైక్లిస్టు మృతి

వలేటివారిపాలెం, జూలై 23 : మోటారుబైకుపై అతివేగంగా వస్తూ ఓ వ్యక్తి సైక్లిస్టును ఢీకొనడంతో సైక్లిస్టు మృతి చెందాడు.ఈ సంఘటన మండలంలోని చుండి ఎంపీయూపీ స్కూల్ ఎదురుగా సోమవారం రాత్రి జరిగింది. ఈ సంఘటనలో పోలినేనిచెరువుకి చెందిన కర్నేటి మాల్యాద్రి (39) మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ బాలమహేంద్రనాయక్ కథనం మేరకు మాల్యాద్రి చుండికి వెళ్లి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, చుండి గ్రామానికి చెందిన చెరువుపల్లి లక్ష్మయ్య మోటారుబైకుపై అతివేగంగా వస్తూ మాల్యాద్రిని ఢీకొన్నాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి ఆదెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

శ్మశానంలో చోరీ

లింగసముద్రం, జూలై 23 : మండలంలోని చినపవని గ్రామ శ్మశాన వాటికలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఇనకొల్లు సతీష్ తన తండ్రికి సమాధి కట్టిస్తున్నారు. రోజూలాగే సోమవారం రాత్రి కూడా సతీష్ సమాధి వద్ద నాలుగేసి చొప్పున బిందెలు, నీళ్ల డ్రమ్ములు, బకెట్లు, కొన్ని ఇనుప చువ్వలు, బేల్దారి సామగ్రిని ఉంచి ఇంటికి వెళ్లారు.అదేరోజూ రాత్రి దొంగలు వాటిని తీసుకెళ్లారని సతీష్ చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ఎంఈవో పాఠశాలల తనిఖీ

కావలి, జూలై23: పట్టణంలోని రెండు పాఠశాలలను ఎంఈవో గోవిందయ్య మంగళవారం తనిఖీ చేశారు. గుర్రంవారివీధిలో ఉన్న ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం స్కూల్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వంటగదిలో పరిశుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలం

కావలి,జూలై23: సమాజంలోని మహిళల మాన, ప్రాణాలకు రక్షణ కల్పించటంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మహిళా సంఘాల నాయకులు ఆరోపించారు. జర్నలిస్ట్ క్లబ్‌లో మంగళవారం ఉమెన్ ఫోర్స్ పట్టణ కన్వీనర్ చాకలికొండ శారద, జమాయితే ఇస్లామీ ఇ హింద్ కార్యదర్శి ఫాతిమా విలేకరులతో మాట్లాడారు. పసికందు నుంచి ముదుసలి వరకు అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవటంలేదన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలు చూస్తే ఆడపిల్లలు పుట్టడమే నేరమా ? అనే ఆలోచనలు కలుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఉమెన్‌ఫోర్స్, జమాయితే ఇస్లామీ ఇ హింద్ సభ్యులు టీ. లక్ష్మీ, నూర్జహాన్, సఖి, సుమయ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కావలి : జనవిజ్ఞానవేదిక పట్టణశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నలందా టాలెంట్‌స్కూల్ ఆవరణలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జేవీవీ కోశాధికారి సుబ్బరాయశర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యుల నిపుణుడు శ్రీరాం మనోహర్‌బాబు, ఈఎన్‌టీ నిపుణులు విజయభాస్కర్, జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు కందికట్ల నారాయణ, పాఠశాల డైరెక్టర్ వసీం, ప్రిన్సిపాల్ మెహతాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతలపాటికి సీపీఎం నేతల పరామర్శ

గుడ్లూరు : మండలంలోని చేవూరుకు చెందిన సీపీఎం సీనియర్ నాయకులు నూతలపాటి నరసింహంను మంగళవారం నెల్లూరు, ప్రకాశం జిల్లాల సీపీఎం నాయకులు పరామర్శించారు ఆయన కొంతకాలం నుంచి తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. స్వగృహానికి వచ్చిన ఆయన్ను పార్టీ నాయకులు జాలా అంజయ్య, ఎం కోటయ్య, జీ శ్రీనివాసులు, కుమార్, ఈ బ్రహ్మయ్య, పీ కొండమ్మ పరామర్శించారు.

సాగు, తాగునీటి సమస్యలు తీర్చాలని సీఎంకు వినతి



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూలై 23: నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం వారిద్దరినీ ప్రత్యేకంగా కలిసిన ఆయన నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. వెలుగొండ ప్రాజెక్టు తూర్పు ప్రధాన కాలువ నుంచి ప్రత్యేక కెనాల్ ద్వారా నియోజకవర్గంలోని లింగసముద్రం, వలేటివారిపాలెం, కందుకూరు మండలాలకు నీరందించేందుకు ఉన్న అవకాశాన్ని మ్యాప్ ద్వారా లోకేష్‌కు వివరించారు. ఈ సమస్యను పరిశీలిస్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రి దృష్టికి రోడ్ల దుస్థితి

కావలి, జూలై23: నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆర్అండ్‌బీశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అమరావతిలో మంగళవారం కావలి మత్స్యకార నాయకులతో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసారు. స్పందించిన మంత్రి కావలి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కావలి రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, రాష్ట్రమత్స్యకారసాధికారసమితి సభ్యులు సోమయ్యగారి రమణ, కుర్రు కొండయ్య, ప్రార్ధనరావు, శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

అల్లూరు, జూలై 23 : గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రతీ సచివాలయంలో ఈనెల 28 వరకు నిర్వహించే ఆధార్ కేంద్రాలను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు దుర్గేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనరు ఫణికుమార్ పాల్గొన్నారు.

● **గ్రామాల అభివృద్ధికి ప్రోత్సాహం**

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. అల్లూరు మండలం తూర్పు గోగులపల్లి, పడమర గోగులపల్లి, గ్రద్దగుంట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామ సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, సర్పంచులు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

కావలి,జూలై23: పట్టణంలో నాలుగో విడత జనసేన సభ్యత్వ నమోదు జోరుగా సాగుతున్నదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య తెలిపారు. జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం ఆయనతోపాటు పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్ విలేకరులతో మాట్లాడారు. జనసేన సభ్యత్వం పొందటం వల్ల బీమా సౌకర్యంతోపాటు స్థానిక సంస్థల్లో పోటీచేయటానికి, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు పొందేవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమావేశంలో జనసేన నేతలు పాలడుగు వెంకటేశ్వర్లు, గుంటుపల్లి క్రిష్ణయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాషువాకు ఘననివాళి

కందుకూరు, జూలై 23: విశ్వకవి గుర్రం జాషువా 73వ వర్ధంతి సందర్భంగా జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బుద్ధ అంబేడ్కర్ విజ్ఞానకేంద్రంలో సంస్థ ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎం. కిషోర్, జీ. హరిప్రసాదు, ఆర్.అయ్యన్న, కే. బ్రహ్మయ్య మాట్లాడుతూ కులమతాలపై రాజీలేని పోరాటం సాగించిన కవిగా తనను తాను విశ్వనరుడిగా ప్రకటించుకున్న సాహితీ ధ్రువతార గుర్రం జాషువా అని నివాళులర్పించారు.

అనధికార బ్యారన్ల నిర్మాణం చట్టరీత్యా నేరం

కందుకూరు, జూలై 23: అనధికార బ్యారన్లు నిర్మించడం చట్టరీత్యా నేరమని పొగాకు బోర్డు ఆర్ఎం ఎం. లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం ఆయన కందుకూరు 2 వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బోర్డు అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ప్రస్తుతం ఉన్న మార్కెట్‌ను చూసి కొందరురైతులు అనధికార బ్యారన్లు నిర్మిస్తున్నట్లు సమాచారం ఉందని, అలాంటి రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. అనంతరం బోర్డు పరిధిలోని శాఖవరం, పోకూరు, వీఆర్ కోట తదితర గ్రామాలను సందర్శించి జనుము పైరును పరిశీలించారు.ఆయన వెంట వేలం నిర్వహణాధికారి కే రాజగోపాలరెడ్డి, తాటికొండ రమణయ్య తదితర రైతు ప్రతినిధులు ఉన్నారు.

అన్న క్యాంటీన్ మరమ్మతుల పరిశీలన

కావలి : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న అన్న క్యాంటీన్‌ను మరమ్మతులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్ పరిశీలించారు. ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో మరమ్మతుల పనులు చేపట్టారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.అలాగే పట్టణంలోని కొత్త శివాలయం, వెంగాయగారిపాలెంలో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను మున్సిపల్ డీఈ సాయికుమార్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు.ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు మార్జిన్ పనులను కూడా పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



సీఎం చిత్రపటాలను సచివాలయంలో ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు

సైదాపురం: టీడీపీ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని పార్టీ మండల సీనియర్ నాయకుడు కందాటి జయరాఘవ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చాగణం గ్రామ సచివాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చిత్రపటాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణ రైతులకు ఇబ్బంది లేకుండా తెలుగు గంగ నీటిని చెరువులకు తెప్పించాడన్నారు. ఉప సర్పంచు కందాటి రాఘవ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, మాజీ ఉపసర్పంచులు మల్లి సిద్ధయ్య, వెంకటరమణయ్య, మాజీ ఉప సర్పంచు సుబ్బరామయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కందాటి దయాకర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు ఉచిత భోజనం

పొదలకూరు, జూలై 23 : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు మంగళవారం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ప్రసాద్ మధ్యాహ్న భోజనంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నేటినుంచి జనరల్ డైట్‌ను (ఉచిత భోజనం) అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

రాపూరు(డక్కిలి), జూలై 23: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త రమేష్‌నాథ్ సూచించారు. మంగళవారం ఆయన రాపూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రజలు అంటురోగాల బారిన పడకుండా పారిశుధ్య పనులు చక్కదిద్దాలన్నారు. కాగా ఆసుపత్రిలో వైద్యుల కొరత గురించి వైద్యురాలు నర్మదాదేవి ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వైద్యుల భర్తీకి చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాపూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొరుటూరులో ఇంటిపై దాడి

ఇందుకూరుపేట, జూలై 23: మండలంలోని కొరుటూరు గ్రామంలో మంగళవారం ఓ ఇంటిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడి చేశారు. ఎస్‌ఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలి

మనుబోలు, జూలై 23: ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని గూడూరు కోర్టు న్యాయవాదులు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కోటేశ్వరరావు, మహబూబ్ బాషా, అరవ పార్వతయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

కోవూరు : స్థానిక టీఎన్‌సీ జూనియర్ కళాశాల విద్యార్థులకు అధ్యాపకులు మంగళవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ సికందర్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ అధ్యాపకులు సొంత నిధులు వెచ్చించి పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయ మన్నారు. ఒక్కొక్కరికి 12 నోటుపుస్తకాలను పంపిణీ చేయడం తమకెంతో ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు.

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన



కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 23: మండలంలోని జొన్నవాడ ఆలయంలో మంగళవారం కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. 20మందికిపైగా అర్చకులు లలితా సహస్రనామార్చనతోపాటు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కామాక్షితాయి సేవలో ప్రముఖులు



నెల్లూరు రూరల్ : వేదగిరిపై డాక్టర్ వాణీమోహన్, ఈవో గిరికృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం/ నెల్లూరు సిటీ: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయిని మంగళవారం ఏపీ స్టేట్ పురావస్తుశాఖ కార్యదర్శి డాక్టర్ జీ వాణీమోహన్, టీటీడీ ఈవో జే శ్యామలరావు సతీమణి శైలజా రావు, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గోత్రనామాలతో శ్రీచక్ర నవావరణ పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందచేశారు. వారి వెంట జిల్లా ఏసీ జే. శ్రీనివాసులు, టీటీడీ, పురావస్తుశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

● **నృసింహుడి సేవలో..**

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మంగళవారం రాష్ట్ర పురావస్తు, మ్యూజియంల శాఖ కార్యదర్శి వాణిమోహన్ సందర్శించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను ఈవో గిరికృష్ణ ఆమెకు వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలను ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు అందించారు.

షాదీ మంజిల్‌కు నిధులు మంజూరు చేయిస్తా!



షాదీమంజిల్‌ను పరిశీలించి వస్తున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మైనార్టీ నాయకులు

పొదలకూరు, జూలై 23: స్థానిక షాదీమంజిల్‌ను మంగళవారం టీడీపీ నియోజక వర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సందర్శించారు. అనంతరం మైనార్టీ సోదరులకు షాదీ మంజిల్ అభివృద్ధికి కృషి చేస్తానని షాదీ మంజిల్‌కు కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపు కోసం కష్టపడిన మైనార్టీ నాయకులకి, కార్యకర్తలకి అభినందించారు. అనంతరం తిరుపతి పార్లమెంటు మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ షేక్.జమీర్‌బాషా మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు నిలిచిన సబ్సిడీ లోన్లు, మసీదు మరమ్మతులకు నిధులు, రంజాన్ తోఫా, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్కిల్‌డెవలప్‌మెంట్ కోర్సులు ఉచిత కుట్టు మిషన్లు అందజేసేందుకు టీడీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్.ఖాదర్‌బాషా, షేక్.షబ్బీర్, షేక్.ఖాదర్‌బాషా, మంజూరు, దేవరం రఘురామరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీంద్ర పాల్గొన్నారు.

బదిలీ తహసీల్దార్‌కు ఘన సన్మానం



తహసీల్దార్ చిరంజీవిని సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

మనుబోలు, జూలై 23: బదిలీపై వెళుతున్న మండల తహసీల్దార్ చిరంజీవిని మంగళవారం రెవెన్యూ సిబ్బంది శాలువాలు, బొకేలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన ఈయన 5నెలల అనంతరం తిరిగి వారి జిల్లాలకు వెళుతున్నాడు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీటి శివప్రసాద్, వీఆర్‌వోలు, సర్వేయర్ పాల్గొన్నారు.

ఎంహెచ్‌వోగా చైతన్య

నెల్లూరు(సిటీ), జూలై 23 : నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారిగా (ఎంహెచ్‌వో) డాక్టర్ చల్లా చైతన్యను నియమిస్తూ రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ కే పద్మావతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన ముత్తుకూరు మండల మెడికల్ అధికారిగా ఉండగా ఏడాది కాలంపాటు ఎంహెచ్‌వోగా నియమిస్తూ డిప్యూటేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఎంహెచ్‌వోగా ఉన్న వెంకటరమణయ్యను మాతృశాఖకు తిరిగి రావాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తన ఆదేశాల్లో పేర్కొంది.

షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు

నెల్లూరు(సాంస్కృతికం) : గాంధీనగర్ షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, షిరిడీ హారతులు జరిగాయి. పంచామృతాభిషేకం, గంధం, విభూది, పన్నీరులతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సామూహిక సాయిసహస్ర నామ పూజలు, బాబాకు ప్రత్యేక అలంకారం, మంత్ర పుష్పం ప్రసాద వినియోగాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి, సభ్యులు కాల్లి శ్యామసుందరెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

రేబాల కాలువపై ర్యాంపు నిర్మించాలి



నగర కమిషనర్ రమణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై23: రేబాల కాలువపై ర్యాంపు నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు మంగళవారం నగర పంచాయతీ కమిషనర్ రమణబాబుకు వినతిపత్రం సమర్పించారు. అలాగే చెన్నూరు రోడ్డుపైకాలువకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని కోరారు. కాలువపైన నిర్మించిన కాంక్రీట్ వాల్స్‌శ్లాబ్‌పై ఉన్న మ్యాన్‌హోల్స్‌పైన మూతలు ఏర్పాటు చేయకపోవడంతో పిల్లలు పడే ప్రమాదం ఉందని తెలిపారు. స్పందించిన కమిషనర్ రెండు రోజుల్లో మ్యాన్‌హోల్స్‌పైన మూతలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సీహెచ్ మల్లికార్జున, జానీబాష, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, మాల్యాద్రి, కామయ్య, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలి

కోవూరు: గ్రామపంచాయతీల అభివృద్ధికి ఇంటి పన్నులు చెల్లించాలని ఎంపీడీవో బాలాంజనేయులు కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రత్యేక ఓడీఎఫ్ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా కోరారు. గ్రామసభలో జడ్పీటీసీ కవరగిర శ్రీలత, కోఆప్షన్ సభ్యుడు జుబేర్‌బాష మాట్లాడారు.

పల్లెపాడులో తిలక్ జయంతి

ఇందుకూరుపేట, జూలై 23 : మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ జయంతి జరిగింది. ముందుగా కమిటీ సభ్యురాలు గంపల మంజుల బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం నెల్లూరు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం ఎందరో మహోన్నత వ్యక్తుల త్యాగాల ఫలితమన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయాధికారి క్షేత్ర సందర్శన

ఇందుకూరుపేట: కొత్తూరు గ్రామంలోని వరి పొలాలను మంగళవారం స్థానిక రైతులతో కలిసి జిల్లా వ్యవసాయాధికారిణి పీ.సత్యవాణి పరిశీలించారు. వరిలో కాండం తొలచు పురుగు, కంకినల్లి, ఆకుముడత తెగుళ్లను గమనించారు. కాండం తొలచు పురుగు నివారణకు తొలి దశలో కాంటాప్ హైడ్రోక్లోరైడ్ 2గ్రాములు లీటర్ నీటికి లేదా కోరాజిన్ 1.5గ్రాములు లీటర్ నీటికి లేదా ఇండాక్సి కార్ప్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కంకినల్లి నివారణకు ఒబెరాన్ 1ఎంఎల్ 1లీటరు నీటికి లేదా ఓమైట్ 2ఎంఎల్ 1లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి డీ.రఘునాథ్‌రెడ్డి, ఏడీఏ ఏ.రాజ్‌కుమార్, ఏడీఏ నర్సోజీరావు, కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, వీహెచ్ఎల్ ఝాన్సీ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల పరిశీలన

ఇందుకూరుపేట, జూలై 23 : మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని వరల్డ్ హెల్త్ ఆర్గనైజనర్ సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ థామస్ మౌనిక మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఐఎల్ఆర్, డీప్ ఫ్రీజ్‌లో నిల్వ ఉన్న వ్యాక్సిన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ మాధవ, తదితరులు పాల్గొన్నారు.

ప్రక్షాళన చేయగలరా..!?

● కార్పొరేషన్‌లో పేరుకుపోయిన అవినీతి ● ఉద్యోగుల్లో నిలువెత్తు నిర్లక్ష్యం ● ఎన్ఎంసీని వెంటాడుతున్న ఫోర్జరీ స్కాం
● నేడు నూతన కమిషనర్ సూర్యతేజ బాధ్యతల స్వీకరణ

సిటీ ప్లానింగ్ అవినీతిమయం.. రెవెన్యూలో నిలువెత్తు నిర్లక్ష్యం.. శానిటేషన్‌లో బాధ్యతారాహిత్యం.. లెక్కలేని తనంలో ఇంజనీరింగ్..! వెరసి నెల్లూరు నగర పాలక సంస్థ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఐఏఎస్ అధికారి సంతకాలే ఫోర్జరీ ఇక్కడ ప్రత్యేకం. ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులు, మితిమీరిన రాజకీయ ప్రమేయం కలిగిన కార్పొరేషన్‌కు నేడు కమిషనర్‌గా మల్లవరపు సూర్యతేజ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రక్షాళన చేస్తే తప్ప పాలన సాగించలేని దుస్థితికి చేరుకున్న ఇక్కడ వ్యవస్థను ఆయన ఎంత మాత్రం గాడినపెట్టగలడన్న ఆలోచనలు రేకెత్తుతున్నాయి. 149.02 చ.కి.మీ మేర విస్తరించిన 54 మున్సిపల్ డివిజన్లు కలిగిన నగరానికి కార్పొరేషన్ ద్వారానే పౌరసేవలు అందాల్సి ఉండగా 8 లక్షల మంది ప్రజలకు జవాబుదారితనంగా నిలవాల్సి ఉంది. ఇటు ప్రజానీకం, అటు రాజకీయ నాయకులు, మరొక పక్క పాలన యంత్రాంగం ఆయన చేయబోయే మార్పుల కోసం ఎదురుచూస్తోంది.

\- నెల్లూరు(సిటీ)

రాష్ట్ర ప్రభుత్వంలో పురపాలక శాఖ అత్యంత ముఖ్యమైంది. అలాంటి శాఖనే విస్మయానికి గురిచేసే సంఘటన ఇక్కడ జరిగింది. ఏకంగా ఐఏఎస్ అధికారైన గత కమిషనర్ వికాస్‌మర్మత్ సంతకాన్నే ఇక్కడున్న అధికారులు, రాజకీయ నాయకులు కలిసి ఫోర్జరీ చేశారు. ఈ అంశం ప్రస్తుతం కార్పొరేషన్ పాలన వ్యవస్థను కుదిపేస్తోంది. సిటీ ప్లానింగ్‌లో జరుగుతున్న అవినీతి భాగోతానికి ఇది పరాకాష్ట. అవినీతిని అడ్డుకుంటే అధికారి సంతకాన్నైనా ఫోర్జరీ చేసేస్తామన్న సంకేతాలిచ్చారు. ఇదంతా సిటీ ప్లానింగ్ విభాగంలో భరితెగింపు కాగా రెవెన్యూలో నిలువెత్తు నిర్లక్ష్యం దర్శనమిస్తోంది. ఏ ఫైల్ తీసుకున్నా అవినీతి కంపుకొడుతోంది. భవనాలకు కార్పొరేషన్ నియమ, నిబంధనలు ప్రకారం కాకుండా యజమాని సూచనల మేరకు ఆస్తి పన్ను విధించడం ఇక్కడి ప్రత్యేకత. ఎన్ఎంసీ ఆదాయం కన్నా స్వలాభం చూసుకోవడం ఆర్వో, ఆర్ఐల పని. ఇక శానిటేషన్‌లో ఇష్టారాజ్యం. ట్రేడ్ లైసెన్సుల పేరిట భారీ కుంభకోణమే నడుస్తోంది. వసూళ్లు చేసేదానికి, ఖజానాలో జమ చేసేదానికి పొంతనలేని దుస్థితి. అర్హతలకు మించి దాడులు చేయడం ఇక్కడ ప్రత్యేకత. ఇదే కారణంతో తాజాగా ఎంహెచ్‌వోనే ప్రభుత్వం ఆక్షేపించడం గమనర్హం. తిరిగి ఆయనను మాతృశాఖకు బదిలీ చేయడం విశేషం. ఇంజనీరింగ్‌లో ఎవరికి వారుగా అవినీతి సామ్రాజ్యాన్ని స్థాపించుకున్నారు. అవినీతికి 'రూపాయి లెక్క' సంస్కృతికి ఇక్కడే బీజం వేశారు. ఏ కార్పొరేషన్‌లో లేని విధంగా నెల్లూరులో ప్రత్యేకించి 18 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. ఇదీ క్షేత్ర స్థాయిలోని వర్కుఇన్‌స్పెక్టర్‌నుంచి పై స్థాయి వరకు ఒకటే మాట.



● **సూర్యతేజపై ఆశలు..**

పూర్తిగా గాడితప్పిన నెల్లూరు నగర పాలక సంస్థను బుధవారం బాధ్యతలు స్వీకరించనున్న మల్లవరపు సూర్యతేజ ఏ తమాత్రం గాడిలో పెట్టగలరన్న ఆశలు రేకెత్తుతున్నాయి. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయ న ఆర్‌కేపురం ఐటీడీఏ పీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. పురపాలక శాఖలో పని చేయడం ఇదే ప్రథమం. అనేక సవాళ్లతో కూడిన ఇక్కడ కమిషనర్ విధులను సమర్ధవంతంగా ఎదుర్కోగలరని సర్వత్రా ఆశిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మొదలుపెట్టిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా పథకాలు 80 శాతం పూర్తయిన వైసీపీ ప్రభుత్వం పక్కపెట్టింది. వాటిని పూర్తి చేయాలని తిరిగి అధికారంలోకి వచ్చిన టీడీపీ భావిస్తోంది. రోడ్ల విస్తర్ణ, పార్కులు సుందరీకరణ వంటి పనులు పూర్తి చేయాలని తాజా ప్రభుత్వ ప్రతినిధులు లెక్కలు వేస్తున్నారు. వాటిని సూర్యతేజ భుజాలపైకి ఎత్తుకోగలరా? రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు నుంచే ప్రతినిధ్యం వహిస్తుండటంతో పాలన మరింత సవాల్‌గా మారనుంది.

గిరిజన నేతపై ఆరోపణలు తగదు

నెల్లూరు(హరనాథపురం), జూలై 23 : నిరంతరం గిరిజనుల సంక్షేమం కోసం పనిచేస్తున్న యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్యపై శేఖర్ అనే వ్యక్తి అవాస్తవ ఆరోపణలు చేయడం సరికాదని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమరగిరి చెంచయ్య అన్నారు. నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన నేత ముసుగులో శేఖర్ యానాదులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజన నేతగా చెప్పుకునే శేఖర్ నిజానికి ఎస్టీ కాదని కోవూరుకు చెందిన ఒక మహిళ కలెక్టరేట్‌తో పాటు గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లంపల్లి రమేష్, మాణికల మురళి, తిరువీధి సతీష్, ఎల్లంపల్లి పెంచలయ్య, తలపల చంద్రమోళి, చెంబేటి ఉష పాల్గొన్నారు.

సీపీఎం సిద్ధాంతం జీవన విధానం కావాలి

నెల్లూరురూరల్, జూలై 23 : పార్టీ సిద్ధాంతం సభ్యులకు జీవన విధానంగా మారాలని సీపీఎం నాయకులు తెలిపారు. మంగళవారం మండలంలోని పొట్టేపాళెంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, పొట్టేపాళెం చంద్రమౌళి మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పార్టీ నాయకత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలూరు తిరుపాలు, పీ.జనార్దన్, సింహగిరి, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి సర్వే పరిశీలన

నెల్లూరు(వైద్యం), జూలై 23 : కుష్ఠువ్యాధి సర్వేపై అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి మంగళవారం పరిశీలించారు. నెల్లూరు నగరంలోని కిసాన్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్న డాక్టర్ ఖాదర్‌వలి అక్కడ ఉన్న వైద్య సిబ్బందితో చర్చించారు. కుష్ఠువ్యాధి సర్వే రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌బాబు, డాక్టర్ సుబ్బయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

27న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 23: మైపాడు గేట్ సెంటర్‌లోని కేపీఆర్ కళ్యాణ మండపంలో ఈనెల 27న ఉదయం 8.45 గంటలకు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వ్రతం జరుగుతుందని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం అర్చకుడు విలిన శివకుమార్‌స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు కొబ్బరి కాయలు, తాంబూలం, 200 గ్రాముల ఆవు నెయ్యి, 5 రకాల పండ్లు, పంచపాత్ర, పళ్లెంలు తెచ్చుకోవాలని తెలిపారు. భక్తులు కేపీఆర్ కళ్యాణ మండపం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల వద్ద టోకెన్ తీసుకోవాలని కోరారు.

ఆప్కోలో 50శాతం డిస్కౌంట్

నెల్లూరు(వ్యవసాయం), జూలై 23: నెల్లూరు వినాయక థియేటర్ ఎదురుగా ఉన్న ఆప్కో షోరూంలో అన్ని రకాల వస్త్రాలపై 30శాతం, ఎంపిక చేయబడిన వస్త్రాలపై 35 నుంచి 50శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆప్కో తిరుపతి మండల వాణిజ్యాధికారి ఎస్.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, మెడికల్, నర్సింగ్, ఐటీఐ, ఫార్మసీ కళాశాలల విద్యార్థులు యూనిఫారం అన్ని ప్రభుత్వ శాఖల యూనిఫారాలు, అప్రాన్స్ లభిస్తాయని పేర్కొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్‌కు జిల్లా క్రీడాకారులు

నెల్లూరు(విద్య), జూలై 23 : జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అస్సాంలో ఈనెల 28 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు జరిగే జాతీయ జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు నెల్లూరుకు చెందిన ఏ.ప్రణయ్‌కీర్తన్ ఎంపికయ్యారన్నారు. అలాగే అనంతపురంలో ఆగస్టు 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలకు నెల్లూరుకు చెందిన ఎం.షమిత, బి.మధుశ్రీ సాగరిక, ఎల్.శృతిలు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపిక పట్ల డీఎస్ఏ సీనియర్ కోచ్ పాండురంగారావు, సాయి హర్షం వ్యక్తం చేశారు.

నాగబాబును కలిసిన జనసైనికులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 23: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబును నెల్లూరు జిల్లా జనసేన పార్టీ కోర్ కమిటి సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం గురించి చేపడుతున్న అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగులకు జిల్లా వాతావరణం అనుకూలం

నెల్లూరు(వ్యవసాయం), జూలై 23 : పాల, ముత్యపు చిప్ప పుట్టగొడుగులకు జిల్లా వాతావరణం ఎంతో అనుకూలమని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ లలిత శివజ్యోతి పేర్కొన్నారు. నెల్లూరు కేవీకేలో మంగళవారం ఆర్య పథకంలో భాగంగా సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. విజయ్‌కుమార్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతలు పుట్టగొడుగుల ఆవశ్యకత, వాటి ఉత్పాదకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యమంలో శాస్త్రవేత్తలు లోకేష్‌బాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, అనూష, 60మంది ఔత్సాహిక రైతులు, మహిళలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నెంబర్లు



అధికారులతో సమీక్షిస్తున్న ఏడీసీ శర్మద

నెల్లూరు(సిటీ), జూలై 23 : నెల్లూరులో ప్రజలను ఇబ్బందిపెట్టే సీజనల్ వ్యాధులపై ఫిర్యాదుకు తమ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసినట్లు ఏడీసీ శర్మద తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆరోగ్యం, ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ఫిర్యాదులు చేయాలనుకునే వారు 0861-2316777కు తాగునీరు, పారిశుద్ధ్యం పట్ల ఫిర్యాదులు అందచేయాలనుకుంటే 0861-2356777కు సమాచారం అందించాలని కోరారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని తెలిపారు. నగరంలోని డ్రైనేజీ కాలువల్లో మురుగు తొలిగింపును వేగవంతంగా చేయాలని సూచించారు.

ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపులపై అవగాహన



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), జూలై 23: విద్యుత్ బిల్లులు ఇంటి నుంచే నేరుగా ఆన్‌లైన్‌లో చెల్లించేలా అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఈ విజయన్ తెలిపారు. నగరంలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన సదస్సు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ బిల్లులను యూపీఐ యాప్స్ ద్వారా, ఇళ్ల నుంచే నేరుగా చెల్లించాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దానిద్వారా సులువుగా బిల్లులు చెల్లించవచ్చునని తెలిపారు. దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సోమశేఖర్‌రెడ్డి, అకౌంట్స్ అధికారి మురళి, డీఈఈ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. విద్యుత్ భవన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కేన్సర్‌పై అవగాహన సదస్సులో ఎస్ఈ మాట్లాడుతూ కేన్సర్ బారిన పడకుండా ఉండేందుకు అవగాహన ఎంతో అవసరం అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ఉత్సవ కమిటీ కృతజ్ఞతలు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 23: బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ విజయవంతం అయినందుకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు షేక్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, మైనార్టీ నాయకులు మంగళవారం అధికారులను స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ సేధుమాధవ్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఆర్డీవో మాలోలాలను వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి షేక్.మునీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పెమ్మసానితో ఎంపీ వేమిరెడ్డి భేటీ



మంత్రి పెమ్మసానిని సత్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 23 : కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని పంచాయతీరాజ్ రోడ్ల దుస్థితిని వివరించారు. గ్రామ, మండల స్థాయిలో వైద్యం, విద్య, ఇతర అవసరాలు, రవాణాకు సంబంధించి గ్రామీణ ప్రజలక ఈ రహదారులు ఎంతో ఉపయుక్తమన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి పెమ్మసాని జిల్లాలో రహదారులను మరమ్మతులు చేయించడానికి చర్యలు తీసుకుంటామని వేమిరెడ్డికి హామీ ఇచ్చారు.

మాజీ మంత్రి పాపాల పెద్దిరెడ్డి పాపం పండుతుంది !

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్‌ఖాన్

నెల్లూరు(వైద్యం), జూలై 23 : మాజీ మంత్రి, వైసీపీ నేత పాపాల పెద్దిరెడ్డి పాపం పండే రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలు దస్త్రాలు దగ్ధం కావటం సిగ్గుచేటని, దీని వెనుక పెద్దిరెడ్డి హస్తం ఉన్నట్లు తెలుస్తుందన్నారు. సైకో జగన్‌రెడ్డి, పాపాల పెద్దిరెడ్డి గత ఐదేళ్లలో చేసిన అరాచకాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలను దగ్ధం చేస్తున్నారని విమర్శించారు. తంబళ్లపల్లి, మదనపల్లి, పుంగనూరు, పీలేరులకు సంబంధించి పేదల భూములు, అసైన్డ్ భూములు, అక్రమ మైనింగ్ ఫైళ్లు కాల్చేసే స్థితికి వైసీపీ నేయకులు వచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, జిల్లా కార్యదర్శి కనపర్తి గంగాధర్, రసూల్, షరీఫ్, దేవరకొండ ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



వైజాగ్ - చెన్నై

పారిశ్రామికరంగానికి భారీ కేటాయింపులతో ప్రయోజనం

వెనుకబడిన జిల్లా కింద కొనసాగనున్న ఆర్థిక సాయం

కారిడార్‌కు ప్రాధాన్యం



తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు సంబంధించి కేటాయింపులు వెల్లడైంది స్థూలంగా మాత్రమే. జిల్లాలోని ఐఐటీ, ఐజర్, కలినరీ ఇన్‌స్టిట్యూట్, జాతీయ సంస్కృత వర్శిటీ, విమానాశ్రయం, రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల వివరాలు తెలియడానికి కొంత సమయం పట్టనుంది.ఇతర కేటాయింపుల విషయానికి వస్తే జిల్లా మీదుగా వెళుతున్న వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇస్తున్నట్టు ప్రకటించింది. జిల్లాకు సంబంధించి ఈ కారిడార్ పరిధి లోకి వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు వస్తుండగా వీటి పరిధిలో కారిడార్‌కు సంబంధించిన పలు నోడ్‌లున్నాయి. ఇప్పటికే ఆయా చోట్ల పారిశ్రామిక వాడలు ఏర్పాటు కాగా మిగిలిన చోట్ల పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూసేకరణ జరుగుతోంది. తాజా బడ్జెట్‌లో ఈ కారిడార్‌కు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో పారిశ్రామిక వాడల ఏర్పాటు వేగవంతం కానుంది. అలాగే ఇప్పటికే ఏర్పాటైన వాడల్లో పరిశ్రమలు వచ్చే అవకాశం మరింత మెరుగుపడనుంది. వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో ఈ పథకం కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రూ. 50 కోట్లు విడుదల కానున్నాయి. ఈ నిధులను ప్రధానంగా జిల్లాలోని వెనుకబడిన మారుమూల ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగించనున్నారు.తాజా బడ్జెట్‌లో పారిశ్రామిక రంగానికి కేటాయింపులు భారీగా పెరిగినందున పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం వున్న జిల్లాలోని తూర్పు ప్రాంతాలకు మేలు జరగనుంది.ఇప్పటికే సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో పారిశ్రామిక రంగం వృద్ధి చెందింది. శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, రేణిగుంట, నాయుడుపేట, తడ, వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల పరిధిలో జాతీయ, బహుళ జాతి కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. శ్రీసిటీ సెజ్ ప్రైవేటు రంగంలో వుండగా నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో నడుస్తోంది. అయితే శ్రీసిటీతో పోలిస్తే మేనకూరు సెజ్ పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణ విషయాల్లో బాగా వెనుకబడి వుంది.తాజా బడ్జెట్ కేటాయింపులతో ఇక్కడ కూడా మరిన్ని పరిశ్రమల ఏర్పాటు వేగవంతం కానుంది.ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడం ద్వారా మరింతమంది యువకులు వ్యాపారాలు, సూక్ష్మ తరహా పరిశ్రమలు స్థాపించి అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడింది.

అమరావతి ఇక పరుగులే

అమరావతికి రూ.15వేల కోట్ల కేటాయింపుతో పనులు వేగవంతం కానున్నాయి.అదేవిధంగా కేంద్ర సహకారంతో పోలవరం ప్రాజెక్టు కూడా పూర్తికానుంది.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

రాష్ట్రానికి సాయం శుభపరిణామం

అమరావతి,పోలవరం ప్రాజెక్టుల పూర్తికోసం సంపూర్ణ సహకారం అందిస్తామనడం సంతోషకరం.పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం ఇవ్వడం వల్ల పారిశ్రామిక అభివృద్ధి పెరుగుతుంది..

- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

క్యాన్సర్ బాధితులకు ఉపశమనం

దేశవ్యాప్తంగా క్రమేపీ క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు.తిరుపతిలో రుయాస్పత్రిలోనూ, స్విమ్స్ ఆస్పత్రిలోనూ అంకాలజీ విభాగాలున్నాయి. స్విమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఏర్పాటు పురోగతిలో వుంది. మరోవైపు జాతీయ స్థాయి ప్రాముఖ్యత కలిగిన టీటీడీ-టాటా సంయుక్త నిర్వహణలోని క్యాన్సర్ ఆస్పత్రి తిరుపతిలోనే వుంది. దీంతో జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాలు, రాష్ట్రాల నుంచీ కూడా క్యాన్సర్ బాధితులు వైద్యం కోసం, వైద్య పరీక్షల కోసం ఇక్కడికి వస్తున్నారు. తాజా బడ్జెట్‌లో క్యాన్సర్ బాధితులు వినియోగించే మూడు ప్రధాన మందులపై జీఎస్టీ తొలగిస్తున్నట్టు ప్రకటించడంతో సంబంధిత మందుల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన క్యాన్సర్ బాధితులకు ఉపశమనం కలిగించనుంది.

మహిళలకు వరం : మహిళల పేరిట ఆస్తులు రిజిస్టర్ చేస్తే స్టాంపు డ్యూటీపై రాయితీని బడ్జెట్‌లో ప్రకటించారు. రిజిస్ట్రేషన్ వ్యయం గణనీయంగా తగ్గనున్న నేపథ్యంలో ఇక నుంచీ కుటుంబ ఆస్తులు, వ్యాపారపరంగా ఆస్తులను మహిళల పేరిట రిజిస్టర్ చేసే అవకాశం పెరిగే అవకాశాలున్నాయి. దీనివల్ల కుటుంబాల్లోనూ, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లోనూ మహిళలకు ప్రాధాన్యత పెరగనుంది.అలాగే బడ్జెట్‌లో బంగారు, వెండిపై కస్టమ్స్ డ్యూటీని ఆరు శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించడంతో త్వరలో వాటి ధరలు కొంత మేరకు తగ్గే అవకాశం ఏర్పడింది.మహిళలకు ఈ పరిణామం కొంత ఊరట నివ్వనుంది.

రాజధానికి ఆసరా

కేంద్ర బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్ల నిధులు కేటాయించడం సంతోషకరం. పోలవరం నిర్మాణానికి కూడా బడ్జెట్ బాసటగా నిలిచింది. విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు నిధులు కేటాయించడం హర్షదాయకం.

- చిన్నస్వామి నాయుడు, రిటైర్డు ఎకనామిక్స్ ప్రొఫెసర్

వెనకబడిన జిల్లాలకు నిధులివ్వడం సంతోషకరం

విద్య, నైపుణ్యాభివృద్ధికి రూ.లక్షన్నర కోట్లు,వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించడం మంచి పరిణామం.ఐదేళ్ళలో నాలుగు కోట్ల మందికి ఉపాధి కల్పించడంతో పాటు ,స్వయం ఉపాధి పొందుతున్న చేతి వృత్తి మహిళలకు రుణ సాయం పెంచడం మంచి పరిమాణం.వెనుకబడిన జిల్లా కోటాతో అందే ప్రత్యేక నిధుల వల్ల మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుంది.

- కొండేటి సునీత, ఎస్వీయూ ఎకనమెట్రిక్స్ ప్రొఫెసర్

వరాలజల్లు

అమరావతి, పోలవరం నిర్మాణాలతో పాటు వ్యవసాయ రంగానికి తగిన విధంగా కేటాయింపులు చేసి ఏపీకి ప్రాధాన్యత ఇచ్చినందుకు ప్రధానమంత్రికి రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు.మొత్తంగా చూసుకుంటే కూడా అత్యంత సమతుల్యమైన బడ్జెట్ ఇది.

- భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ నేత

విద్యారంగానికి కేటాయింపులు బాగున్నాయ్

వేతన జీవులకు స్వల్ప ఊరట లభించింది.ఏపీ అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించడం హర్షణీయం. విద్యారంగానికి కూడా నిధుల కేటాయింపు సంతృప్తికరంగానే వుంది.

- ఎస్. బాలాజి, ఆపస్ అధ్యక్షుడు

ఉద్యోగులకు స్వల్ప ఊరట

నాలుగేళ్ల నుంచి ఆదాయపన్ను శ్లాబ్‌లో మార్పులేదు.ఈ బడ్జెట్‌లో స్టాండర్డ్ డైరెక్షన్ రూ.50వేల నుంచి 75వేలకు పెంచడం వల్ల ఉద్యోగులకు స్వల్ప ఊరట లభించింది.ఉద్యోగులకు మరింత లబ్ధి చేకూరేలా పాత విధానంలో కూడా మార్పులు చేసి ఉంటే బాగుండేది.

- కె.వెంకటరమణ,హెచ్‌ఎంల సంఘ అధ్యక్షుడు

నిరాశాపూరితం

పాత పన్నుల విధానంలో మార్పులు తీసుకురాకుండా కొత్త పన్నుల విధానంలో స్వల్ప మార్పులు చేయడంవల్ల వేతన జీవులకు ఈ బడ్జెట్ నిరుపయోగంగా మారింది. ఆదాయ పన్నుకు సంబంధించి కొత్త విధానంలో ఎక్కువ పన్ను చెల్లించాల్సిరావడంతో ఉద్యోగులందరూ మళ్లీ పాత విధానమే మేలనుకునే పరిస్థితి వచ్చింది. సీపీఎస్ విధానంలో మార్పులు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానం అమలుపై ప్రకటన లేకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయులను నిరాశపరిచింది. విద్యారంగానికి 6 శాతం బదులు 3.25 శాతం నిధులు కేటాయించడం విద్యారంగంపట్ల కేంద్రప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది

- కె. ముత్యాలరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అప్పులు కాదు...గ్రాంట్ కావాలి

మన రాష్ట్రానికి కావాల్సింది అప్పులు కాదు, గ్రాంట్ ఇవ్వాలి. 90 శాతం గ్రాంట్‌గా ఇచ్చేదాన్నే ప్రత్యేక హోదా అంటారు. మనకేమో అప్పులు ఇస్తామంటున్నారు. మసిపూసి మారేడుకాయ చేశారు.ఇది పూర్తిగా అసంతృప్తికరమైన బడ్జెట్.

- చింతామోహన్, కాంగ్రెస్ నేత

ఆశాజనకం

పెరిగిన ధరలతో ఉద్యోగులు సతమతమవుతున్న రోజుల్లో బడ్జెట్ కేటాయింపులు ఊరటనిచ్చాయి. ఆదాయపన్ను శ్లాబ్ రేట్లను సవరించినందుకు కృతజ్ఞతలు .

- వరప్రసాద్ నైనార్, ఏపీ ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు

వైసీపీ ఘనకార్యాలు



నీకొకటి...నాకొకటి..!

- స్విమ్స్‌లో రెండు మెడికల్ షాపులను పంచుకున్న టీటీడీ మాజీ ఛైర్మన్లు
- అనుచరుల పేరుతో చెరొక జనరిక్ షాపు
- ఎన్నికలకు ముందు మరో రెండేళ్ళు పొడిగింపు
- నిర్వహణ మొత్తం నిబంధనలకు విరుద్ధం
- కొత్త ప్రభుత్వంలో అయినా అవి రద్దయ్యేనా?

తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ ఆధీనంలోకి స్విమ్స్ వచ్చీరాగానే రాజకీయ పెత్తనం పెరిగిపోయింది. జనరిక్ (జన ఔషధి)మెడికల్ షాపుల పేరిట అప్పటి టీటీడీ ఛైర్మన్లు వారి అనుచరులకు చెరొక మెడికల్ షాపును కట్టబెట్టారన్న విమర్శలు వెల్లువెత్తాయి. గడువు తీరిపోయినప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్ ముందు జరిగిన టీటీడీ పాలకమండలి చివరి సమావేశంలో మరో రెండేళ్ల పాటు గడువు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయంపై కూటమి నేతలు మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ షాపులను రద్దుచేసేదిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు.

ఔషధాలను తక్కువ ధరకే ప్రజలకు అందించాలన్న ఉన్నతమైన లక్ష్యంతో ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరిక్ (జన ఔషధి)మెడికల్ షాపులుండాలని ఏడేళ్లక్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. అవకాశం ఉన్నచోటంతా స్వచ్ఛంద సేవాసంస్థలకో, డ్వాక్రా మహిళా గ్రూపులకో మందుల షాపుల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తూ వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీటీడీ ఛైర్మన్‌గా నియమితులైన వైవీ సుబ్బారెడ్డి సిఫారసుతో స్విమ్స్ ఓపీ విభాగంలో రవికుమార్‌కు 2021లో రూ.22వేల నామమాత్రపు అద్దెతో ప్రధాన్ మంత్రి భారతీయ జన ఔషధి కేంద్ర (పీఎంబీజేకే) జనరిక్ మెడికల్ షాపును కేటాయించారు. షాపు లక్ష్యాలను తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా మందులను రోగులకు అంటగడుతున్నారన్న విమర్శలు తరచూ వినిపించాయి. ఈ నేపథ్యంలో స్విమ్స్ డైరెక్టర్ సూచన మేరకు పలుసార్లు పీఎంబీజేకే జనరిక్ షాప్‌లో నాణ్యతా ప్రమాణాల తనిఖీ (క్వాలిటీ ఆడిట్ చెక్)నిర్వహించగా..కాలం చెల్లిన మందులు, ఎక్స్‌పైరీ డేట్ దగ్గర పడిన మందులు షాపులో ఉన్నట్టు కమిటీ గుర్తించింది. అదేవిధంగా 90 శాతం ఉండాల్సిన జనరిక్ డ్రగ్స్ 30శాతానికి మించిలేవని తనిఖీల్లో తేటతెల్లమైంది. జనఔషధి మందులు ఉండాల్సిన చోట సర్జికల్ ఐటెమ్స్, ఆయుర్వేదిక్ ఉత్పత్తులు, పలురకాల బ్రాండెడ్ మందులే ప్రధానంగా షాపులో ఉంచినట్టు కమిటీ తేల్చింది. అర్హతగల ఫార్మసిస్టులు లేకపోవడంతో పాటు షాపు మొత్తం అపరిశుభ్రంగా ఉండడాన్ని కమిటీ సభ్యులు గుర్తించారు. హైరిస్క్ మెడిసిన్స్ ఎమర్జెన్సీ మందులు ప్రత్యేకంగా నిల్వచేయలేదని, మందుల షాపుకుండాల్సిన ప్రాథమిక లక్షణాలు కూడాలేవని తేల్చారు. వారంలో సమాధానం చెప్పాలని గతంలో షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చారు. నివేదికను స్విమ్స్ డైరెక్టర్‌తో పాటు ఎస్‌ఏటీహెచ్ సెల్‌కు కూడా పంపారు. అయినా అధికార పార్టీ పెద్దల అండ ఉండడం వల్ల ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.ఇక మరో షాపును టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి దగ్గర పనిచేసే సాయికుమారికి డ్వాక్రా సమాఖ్య కింద స్విమ్స్ పాత భవనం వద్ద కేటాయించారు. నెలకు రూ.24వేల అద్దెతో పొందిన ఈ షాపును ఇతరులకు లక్ష రూపాయలకు పైగా లీజుకిచ్చినట్టు సమాచారం. ఇందులో కూడా జనరిక్ మందులు లేకుండా బ్రాండెడ్ మందులు విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. జనరిక్ మందులకు ఇవ్వాల్సిన డిస్కౌంట్‌ను కూడా సక్రమంగా ఇవ్వడంలేదని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. ఇప్పటికైనా వీటి రెన్యువల్‌ను రద్దు చేసి నిబంధనల మేరకు కేటాయించాలని కూటమి పార్టీల నేతలు కోరుతున్నారు.

మీ ఆదరాభిమానాలే

నన్ను రప్పించాయి

- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి





కమ్మగుట్లపల్లెలో మహిళల ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం/గుడుపల్లె, జూలై 23: 'కుప్పం నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ ఇచ్చిన రెండు పంచాయతీలను నేను దత్తత తీసుకుంటున్నా. వీటిని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేస్తా' అని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. తన నాలుగు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మొదటి రోజైన మంగళవారం గుడుపల్లె మండలంలోని కమ్మగుట్లపల్లె, కంచిబందార్లపల్లె, కోటపల్లె, గుత్తార్లపల్లె గ్రామాలలో ఆమె పర్యటించారు. మహిళలతో ముఖాముఖి మాట్లాడారు.యువత ఉపాధికోసం మూడు పెద్ద పరిశ్రమలను తీసుకొస్తామని ప్రకటించారు. విద్యతోపాటు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభించేలా చూస్తామన్నారు. చంద్రబాబుతో పనిలేకుండా తాను ప్రతి రెండుమూడు నెలలకోసారి కుప్పం వస్తానని, ఇక్కడి ప్రజల సాధకబాధకాలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో కుప్పం ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక మ్యానిఫెస్టో అమలు చేయడానికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. కుప్పం తన కుటుంబమని, అన్ని వేళలా ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నాయకులు పీఎస్ మునిరత్నం,డాక్టర్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీలకు బ్రేక్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగాన్ని రెండ్రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు కాల్చేసిన ఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ కోసం వచ్చిన తహసీల్దార్లను రిలీవ్ చేయవద్దంటూ సీసీఎల్‌ఏ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ క్రమంలో మంగళవారం జిల్లాలో 34మంది పొరుగు జిల్లాల తహసీల్దార్లకు రిలీవ్ ఆర్డర్లను కలెక్టర్ వెంకటేశ్వర్ నిలుపుదల చేశారు. ఇక తహసీల్దార్ల బదిలీలు ఎపుడు ఉంటాయో అని పూర్తి స్పష్టత రాలేదు. అలాగే 2019 నుంచి ఐదేళ్ల కాలంలో జిల్లాలో వ్యవసాయ, ఇనాం, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం, కన్వర్షన్‌చేసిన వివరాలపై జిల్లా అధికారులను సీసీఎల్‌ఏ కోరినట్లు తెలిసింది.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి

మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే పాశం విన్నపం



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, జూలై 23: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు. మంగళవారం అమరావతి లోని సచివాలయ కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గూడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలో ఉండడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇటు ప్రజలు, అటు అధికారులు ఇబ్బందులు పడుతున్నా ర న్నారు. గూడూరు నుంచి తిరుపతికి 100 కిలోమీటర్లుకు పైగా ఉండడంతో పనులపై జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వస్తోం దన్నారు. నెల్లూరైతే 35 కిలోమీటర్లు ఉండడంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. యువగళం పాదయాత్ర సమయంలో నియోజకవర్గంలో పర్యటించే సమయంలో గూడూరును నెల్లూరులో కలుపుతామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే మంత్రి లోకేశ్‌కు గుర్తుచేశారు. దీంతో మంత్రి సాను కూలంగా స్పందించినట్టు తెలిపారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే నెల్లూరు జిల్లాలో కలిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. అదేవిధంగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని విన్నవించినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను కలిసి చెన్నై- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో చిల్లకూరు, కోట మండలాలకు చెందిన రైతుల భూసేకరణకు సంబంధించి పరిహారాన్ని త్వరితగతిన అందించాలని విన్నవించానన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ



మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ మంత్రి పరసా, మాజీ ఎమ్మెల్యే నెలవల

సూళ్లూరుపేట/ నాయుడుపేట, జూలై 23: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మంగళవారం అమరావతిలో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మ ర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ విరామ సమయంలో లోకేశ్ ఛాంబర్‌లో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అదే విధంగా సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యను కూడా మంత్రికి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో, పెళ్లకూ రు మండలంలోని శిరసనంబేడులో పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాడాలని మంత్రిని కోరారు. అలాగే నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం, పెళ్లకూరు మండలంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారధి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడినట్లు తెలిపారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యేతో పాటు పెళ్లకూరు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు నాగేంద్రరెడ్డి కూడా ఉన్నారు.

మంత్రి ఆనంను కలిసిన టీడీపీ నేతలు



పెళ్లకూరు, జూలై 23: ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, బంగారంపేట సర్పంచు డి.నాగేంద్రప్రసాద్‌రెడ్డి, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వి.శేఖర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం అమరావతి అసెంబ్లీ హాల్‌లో కలసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు.

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం: బీజేవైఎం

గూడూరు, జూలై 23: దేశప్రజలందరికీ ఆమోద్యయోగంగా ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌ను స్వాగతిస్తున్నామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక బీజేవైఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 కేంద్ర బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాలను, రాష్ట్రాలను ఆదుకునే విధంగా ఉండడం శుభపరిణామమన్నారు. ఆంధ్రప్రజల కలల రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.15వేల కోట్లు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి కోసం బడ్జెట్‌లో పలు విభాగాలకు నిధులు కేటాయించినందుకు ఎన్డీఏ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

పెళ్లకూరు: రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించడం హర్షనీయమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల జగన్ పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని బాగు చేసేందుకు కంకణం కట్టుకున్న సీఎం చంద్రబాబు బీజేపీతో కలసి పని చేయడంతోనే ఇది సాధ్యమవుతుందని వారు ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, పోలవరం నిర్మాణానికి సహకారం, విభజన చట్టంలో ఉన్న అన్ని ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం అభినందనీయమని తెలిపారు.

పదోన్నతి కల్పించండి

వెంకటగిరి టౌన్, జూలై 23: జిల్లాలో డీప్యూటీ తహసీల్దార్‌గా గత పదేళ్లుగా పనిచేస్తున్న వారికి పదోన్నతులు కల్పించాలని డీటీ యువరాజ్ మంగళవారం కోరారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లో జూనియర్ అయిన ప్యానల్‌లో లేనటువంటి ఉప తహసల్దార్లు జోన్-4 ఉప తహసీల్దార్ (ఎఫ్ఏసీ)లుగా కొన్ని మండలాల్లో నియమించినట్టు తెలిపారు. తహసీ ల్దార్‌గా అర్హత కల్గి ఉన్నా పదోన్నతులు కల్పించ లేదని తెలిపారు. అర్హత కల్గిన సీనియర్ డీప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతి అవకాశం కల్పించాలని కోరారు.

27వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

గూడూరు అర్బన్, జూలై 23: పట్టణంలోని సచివాలయాల్లో ఈనెల 24నుంచి 27వ తేద వరకు ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఆధార్ బయోమెట్రిక్, అప్‌డేషన్, నూతన కార్డుల నమోదుకు వీలుగా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధితురాలికి చేయూత

చిల్లకూరు, జూలై 23: మండలంలోని చింతవరానికి చెందిన కోటమ్మ ఇల్లు ఇటీవల కాలిపోవడంతో మంగళవారం తహసీల్దారు శ్రీనివాసులు రూ.5వేలు నగదు, నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ సూచనల మేరకు కోటమ్మకు నగదు, నిత్యావసరాలు అందించినట్టు తహసీల్దారు తెలిపారు.

తహసీల్దారు రిలీవ్

కోట, జూలై 23: తహసీల్దారు డి.నాగరాజరావు మంగళవారం రిలీవ్ అయ్యారు. గుంటూరు జిల్లా వేమూరు తహసీల్దారుగా పని చేస్తున్న నాగరాజరావు ఎన్నికల విధుల నిర్వహణ కోసం కోటకు వచ్చారు. ఎన్నికలు ము గిసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జి తహసీల్దారుగా డీటీ మల్లికార్జునరావు నియమితులయ్యారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఆర్‌అండ్‌బీ బంగ్లా

సూళ్లూరుపేట, జూలై 23: ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేదు.. వాటిపై సంబధిత అధికారులకు అజమాయిషీ సైతం లేకపోవడంతో ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆ భూములను గుట్టుచప్పుడు కాకుండా కొట్టేసే ప్రయత్నాలు జరిగింది. అయినా అధికారుల తీరులో మార్పు రాలేదు. సూళ్లూరుపేట నడిబొడ్డున సుమారు ఎకరా స్థలంలో ఆర్‌అండ్‌బీ బంగ్లా ఉంది. ఈ బంగ్లాలో అన్ని వసతులతో కూడిన రెండు సూట్లు ఉన్నాయి. ఉన్నతాధికారులు, వీఐపీలు వచ్చినప్పుడు ఈ బంగ్లాలోనే బస చేస్తారు. ఎన్నికలకు ముందు ఈ బంగ్లాను రూ.20 ఆధునికీకరించారు. అయితే వినియోగంలోకి తేలేదు. చుట్టూ పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉండడమే కాకుండా మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలను నిలయంగా మారింది. బంగ్లా ఆవరణలో ఎక్కడ చూసినా మందు బాటిళ్లు, గ్లాసులు పడి ఉన్నాయి. ఈ బంగ్లాకు కూతవేటు దూరంలో అర్‌అండ్‌బీ అధికారుల కార్యాలయం ఉన్నా పట్టించుకోవవడం లేదు.

తడలో వింత పరిస్థితి....

అదే విధంగా తడలో కూడా ఆర్‌అండ్‌బీ శాఖకు విలువైన భూమి ఉంది.



నిరుపయోగంగా ఉన్న సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ బంగ్లా

మండలంలోని తడ కండ్రిగ సర్వే నెం.110లో 3.50 ఎకరాలున్నాయి. 1996కు ముందు అక్కడ ఒక అతిథి గృహం ఉండేది. అది శిథిలావస్థకు చేరుకోవడంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పరసా వెంకటరత్నం నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు. అయితే 50 శాతం పనులు పూర్తయినా ఇతర కారణాలతో ఆగిపోయింది. 2020లో ఈ భూముల్లో కొంతభాగం అన్యాక్రాంతమైంది. దీంతో అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన విచారణ జరిపి స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.100 కోట్ల విలువైన భూమి అది. దాన్ని సంరక్షించుకోవాలన్న ఆలోచన అధికారులకు లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు ఈ బంగ్లాలాలపై శ్రద్ధ వహించి వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.



మొండి గోడలతో నిలిచిపోయిన తడ ఆర్‌అండ్‌బీ భవనం

పురాతన శివాలయాన్ని చదును చేసేశారు!



చదును చేసిన పురాతన చిన్న శివాలయం - గ్రామస్తులు భద్రపరచిన శివలింగం, నాగలక్ష్మి

నాయుడుపేట, జూలై 23: దాదాపు 500 సంవత్సరాల నాటి పురాతనమైన శివాలయం పక్కన ఉన్న చిన్న శివాలయాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చదును చేసేశారు. ఆ ఆలయంలోని విగ్రహాలను పక్కన పడేయడంతో వాటిని గ్రామస్తులు మంగళవారం గుర్తించారు. నాయుడుపేట మండలం పుదూరులోని పొలాల సమీపంలో అతి పురాతనమైన శివాలయం ఉంది. గతంలో గుప్త నిధుల కోసం ఆగంతకులు ఆ ఆలయం వద్ద తవ్వకాలు కూడా చేపట్టారు. అలాగే ఈ ఆలయానికి సమీపంలో చిన్న శివాలయం, నాగలక్ష్మిపుట్ట ఉన్నాయి. అక్కడ తవ్వకాలు చేపట్టాలనుకున్నారో ఏమో ఆ చిన్నగుడిని పూర్తిగా తొలగించేశారు. ఈ సంఘటనపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తూపిలిపాళెం బీచ్‌లో గుర్తించిన భూమిని పర్యాటకశాఖకు అప్పగించండి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: తూపిలిపాళెం బీచ్‌లో గుర్తించిన భూమిని పర్యాటకశాఖకు త్వరగా అప్పగించడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత రెవెన్యూ అధికారులతో ఆయన మాట్లాడారు. వాకాడు మండలంలోని తూపిలిపాళెం బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి 6.50 ఎకరాల భూమిని నిబంధనల మేరకు పర్యాటకశాఖకు అప్పగించడానికి చర్యలు చేపట్టాలని తహసీల్దారు నరసింహారావును ఆదేశించారు. ఈ భూమిలో రిసార్ట్స్ ఏర్పాటు, వాటర్ స్పోర్ట్స్‌కు చర్యలు తీసుకున్నట్లు జిల్లా పర్యాటశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. పర్యాటకశాఖ సిబ్బంది ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు నరసింహారావుకు సూచనలిస్తున్న కలెక్టర్

నీటి నమూనాలపై ప్రత్యేక శ్రద్ధ

కోట, జూలై 23: గ్రామాల్లో ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాటి నమూనాలను సేకరించాలని డీఎల్‌పీవో వెంకటరమణ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్యం, తాగునీటిపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ... గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్ చల్లి శుభ్రం చేయాలన్నారు. ప్రతి నీటి బొట్టును పరిశీలించాలన్నారు. అదే విధంగా పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎక్కడ చెత్త నిల్వలు ఉండరాదన్నారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, డీఆర్‌పీ రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో శేఖర్

నాయుడుపేట, జూలై 23: నాయుడుపేట బ్రాహ్మణవీధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యాభ్యాసాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ... విద్యార్థుల సామర్థ్యాల మేరకు సరళీకృతంగా బోధించాలన్నారు. గూడూరు ఉప విద్యాశాఖాధికారి ఎస్.శాంతి, శివశంకర్, ఎంఈవో బి.మునిరత్నం తదితరులు ఉన్నారు.

ఐదు వాటర్ ప్లాంట్లకు నోటీసులు

నాయుడుపేట టౌన్, జూలై 23: వాటర్ ప్యాకెట్లను తయారు చేయకుండా మున్సిపాలిటీ పరిధిలోని ఐదు వాటర్ ప్లాంట్లకు నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి తెలిపారు. నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ ఏఈ చంద్రమోహన్, శానిటరి ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమీక్షించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.90 కోట్లు

తిరుమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.90 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 71,939 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

సుందరమ్మకు ప్రత్యేక పూజలు



అంబళ్లు మోసుకొస్తున్న మహిళలు



చిల్లకూరు, జూలై 23: మండల కేంద్రమైన చిల్లకూరు దళితవాడలోని సుందరమ్మ గుడిలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆగస్టు 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న తిరునాళ్లలో భాగంగా మొదటి మంగళవారం తప్పెట్లు, యువకుల నృత్యాల నడుమ భక్తులు అమ్మవారికి అంబలి పోసే కార్యక్రమం, ముడుపులు కట్టే కార్యక్రమం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

జనసేన సభ్యత్వ బీమాలో మార్పులు

నాయుడుపేట, జూలై 23: జనసేన క్రియాశీలక సభ్యత్వ బీమాలో కొంత మార్పు జరిగినట్లు ఆ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. ప్రమాద బీమా రూ.5 లక్షలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.2.5 లక్షలు, ప్రమాదం జరిగితే తక్షణ సాయం రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్రియాశీలక సభ్యత్వ కార్డుపై ఉన్న నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

'ఐసీడీఎస్‌లో ఉద్యోగంపై ఫోన్ వస్తే స్పందించవద్దు'

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23: స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ఆశాఖ అధికారి జయలక్ష్మి తెలిపారు. అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. తదుపరి కమిటీ సభ్యుల ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఈలోపు అభ్యర్థులకు అజ్ఞాత వ్యక్తులు 85829 59429 నెంబరునుంచి ఫోన్ చేసి మీకు ఉద్యోగం ఖరారైందని డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసిందని పేర్కొన్నారు. ఇటువంటి వారి మాటలను నమ్మొద్దని, ఇలా ఎవరైనా ఫోన్ చేస్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అభ్యర్థులకు సూచించారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి

పోలీసుల అదుపులో మృతుడి భార్య



మృతుడు నరేష్ - మృతుడి భార్య ధనలక్ష్మిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తిరుచానూరు, జూలై 23: అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన తిరుపతి రూరల్ మండలం పాడిపేట శివపురం కాలనీలో చోటు చేసుకుంది. మృతుడి సోదరుడు ఈశ్వరయ్య కథనం మేరకు వివరాలు... ఏర్పేడు మండలం ముసలిపేడు హరిజనవాడకు చెందిన నరేష్(35)కు తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకానికి చెందిన ధనలక్ష్మితో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్ ముసలిపేడులో నివాసం ఉంటూ తిరుచానూరుకు వచ్చి ఆటో నడుపుకుని తిరిగి రాత్రికి ఇంటికి వెళ్లేవాడు. ముసలిపేడు హరిజనవాడకు చెందిన ఓ యువకుడితో అతడి భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. దీంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో నరేష్ తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాడిపేట శివపురం కాలనీలో రెండు వారాల క్రితం ఇంటిని అద్దెకు తీసుకుని భార్య, బిడ్డలతో మకాం మార్చాడు. తిరుచానూరులోనే ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువజామున అద్దెకు ఉన్న ఇంటి వరండాలో నరేష్ తాడుకు వేలాడుతూ విగతజీవుడై కనిపించాడు. గుర్తించిన చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు, మృతుడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. పోలీసులు వెళ్లేటప్పటికే మృతుడి భార్య ధనలక్ష్మి, మరి కొందరు కలిసి రేకుల పైకప్పుకు చీరతో వేలాడుతున్న మృతదేహాన్ని కిందకు దించి పడుకోబెట్టారు. విషయం తెలుసుకున్న తిరుచానూరు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడి కుటుంబీకులు, స్థానికులు నరేష్ భార్య ధనలక్ష్మిపై అనుమానం వ్యక్తం చేయడంతో ఆమెను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తన తమ్ముడి మరణం విషయంలో మరదలు ధనలక్ష్మి, తమ గ్రామానికి చెందిన హరిపై అనుమానం ఉందని ఈశ్వరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. నరేష్ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కటుంబీకులకు అప్పగించారు. ఇదిలా ఉండగా తమ ఇంటికి రాత్రి హరి బాబాయ్ వచ్చాడని.. అమ్మ, అతడు కలిసి నాన్న ముఖంపై దిండుతో అదిమారని.. తరువాత చీరతో వేలాడదీశారని పోలీసులకు నరేష్ కుమార్తె ఏడేళ్ల చిన్నారి చెప్పినట్లు తెలిసింది. తన భార్యకు వేరే యువకుడితో వివాహేతర సంబంధం ఉండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేకా భార్య, ఆమె ప్రియుడి చేతిలో హత్యకు గురయ్యాడా? అన్న విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ సంఘటన పాడిపేటలో తీవ్ర సంచలనం రేకెత్తించింది.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నాయుడుపేట టౌన్, జూలై 23: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. నాయుడుపేట మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లతోపాటు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహితపై కత్తితో దాడి

మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలింపు



దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మి

నాయుడుపేట టౌన్, జూలై 23: రెండేళ్లుగా వారి మధ్య వివాహేతర సంబంధం నడుస్తోంది. ఇంతలో ఏమైందో తెలియదు ఆమె అతడితో దూరం జరిగింది. ఇది తట్టుకోలేక మద్యం మత్తులో ఆ మహిళపై విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశాడు సదరు వ్యక్తి. ఈ ఘటన మంగళవారం తెల్లవారు ఝామున జరిగింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పూడేరు గ్రామానికి చెందిన లక్ష్మి మరో కొంతమంది మహిళలు ప్రతి రోజు తెల్లవారు జామున చెన్నైకు వెళ్లి బియ్యం తీసుకువచ్చి నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో విక్రయించి జీవనం సాగిస్తుంటారు. విక్రయించే సమయంలో శ్రీకాళహస్తికి చెందిన నాగార్జున్‌తో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈక్రమంలో ఎప్పటిలాగే లక్ష్మి మరో మహిళతో కలసి చెన్నైకు వెళ్లేందుకు మంగళవారం తెల్లవారుజామున నాయుడుపేట - మల్లాం జంక్షన్ జాతీయ రహదారి కూడలి వద్ద ఓ దుకాణం వద్ద కూర్చొని ఉంది. అదే సమయంలో నాగార్జున్ అక్కడికి చేరుకున్నాడు. లక్ష్మీ సహా అక్కడే ఉన్న మహిళతో వాగ్వాదానికి దిగాడు. అక్కడే దుకాణాల వద్ద నిద్రిస్తున్న వారు నచ్చచెప్పి అక్కడి నుంచి పంపేశారు. కొంత సమయం తరువాత మద్యం తాగి వచ్చిన నాగార్జున్ మళ్లీ మహిళల దగ్గరకు చేరుకొని తన చేతిలో ఉన్న కత్తితో లక్ష్మిపై విచక్షణా రహితంగా దాడి చేసి పరారయ్యాడు. చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లక్ష్మిని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసుయి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కారు

ఒకరి మృతి, నలుగురికి గాయాలు

ఓజిలి జులై 23: మండలంలోని పెద్దపరియ క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన ఒకరు మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న లారీ పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ఉన్నట్టుండి బ్రేక్ వేయడంతో అదే మార్గంలో ఒంగోలుకు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చీమకుర్తికి చెందిన శీను(40)తో పాటు మరో నలుగురు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై అరుణాచలం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో ముందు సీట్లో ఉన్న శీను తీవ్రంగా గాయపడగా, డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శీను చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిబాబు తెలిపారు.

తమిళ రేషన్ బియ్యం స్వాధీనం

తడ, జూలై 23: అక్రమంగా తరలిస్తున్న 10 టన్నుల తమిళ రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై నగరం తాంబరం నుంచి తమిళ రేషన్ బియ్యంతో రెండు మినీ ట్రక్కులు తడ బయలుదేరాయి. పోలీసులకు సమాచారం అందడంతో బోడిలింగాలపాడు మలుపు వద్ద సోమవారం రాత్రి తనిఖీలు చేశారు. అదే సమయంలో సమీపంలోని పెట్రోలు బంకు వద్ద రెండు మినీ ట్రక్కులు నిలిపి ఉండడంతో వాటిని తనిఖీ చేశారు. అందులో బియ్యం ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని ఆ వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు వాహనాల్లో 201 బస్తాల్లో 10 టన్నుల బియ్యాన్ని సివిల్ సప్లయ్ డీడీ ఓబయ్యకు అప్పగించారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.3.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇద్దరూ డ్రైవర్లతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు ఎస్ఐ నరసింహరావు తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం



కొండాపురం పాఠశాలలో పోస్టర్ల ద్వారా అవగాహన

వాకాడు/ కోట/ గూడూరు అర్బన్, జూలై 23: బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని వాకాడు ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ అన్నారు. వాకాడు మండలంలోని కొండాపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతోపాటు పరిశుభ్రత, పౌష్టిక ఆహారంపైకూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని కోట సీడీపీవో మునికుమారి చెప్పారు. గూడలి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ జరిగింది. అనంతరం బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను వివరించే వాల్ పోస్టర్లను సీడీపీవోతోపాటు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ కవిత ఆవిష్కరించారు. గూడూరు పట్టణంలోని బాలాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలపై సీడీపీవో మెహబూబి మంగళవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.